RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 257 పేజీలు - 08 బుధవారం 12 ఆగస్టు 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## సగర్వంగా హర్ ఘర్ తిరంగా

- ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ పోస్ట్




# పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి

- పెండింగ్ భూసేకరణ పనులు త్వరగా పూర్తి
- మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 11 :** హైదరాబాద్ పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మెట్రో ఫేజ్–2 పనుల్లో వేగం పెంచాలని దిశానిర్దేశంచేశారు. ఎంజీబీఎస్ – చాంద్రాయణగుట్ట మెట్రో కారిడార్‌పై కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. 7.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. మెట్రో పనులకు వీలైనంత త్వరగా టెండర్ పక్రియ ప్రారంభించాలని సూచించారు. పాతబస్తీ మెట్రో మిగతా2లో...


## విషాదాన్ని మిగిల్చిన కొలంబియా భూకంపం

- 132కు చేరిన మృతుల సంఖ్య
- శిథిలాల కింద పెద్ద సంఖ్యలో ప్రజలు
- సహాయక చర్యలు ముమ్మరం చేసిన ప్రభుత్వం




## జేపీసీ పరిశీలనకు ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లు

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఆగస్టు 11 :** వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎలాంటి చర్చలు లేకుండానే పలు బిల్లులపై మోడీ ప్రభుత్వం ఆమోద ముద్ర వేయించుకుంటుంది. సోమవారం లోక్ సభలో విదేశీ విరాళాల మిగతా2లో...



## రేవంత్ షెల్ కంపెనీల బాగోతం త్వరలోనే బండారం బయటపెడతాం

- సిఎం సోదరులంతా పెద్దపెద్ద కంపెనీ ఓనర్లు: కెటిఆర్



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 11 :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులంతా పెద్ద పెద్ద కంపెనీలకు యజమానులవుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక్క ఉద్యోగి కూడా లేకుండా కొత్తకొత్త కంపెనీలు ఏర్పాటుచేస్తున్నారని విమర్శించారు. సీఎం సోదరులు చిన్నచిన్న ఇంటి అడ్రస్‌లతో పెద్దపెద్ద కంపెనీలు రిజిస్ట్రేషన్ చేయించారు. అలాంటి ఊరుపేరు లేని కంపెనీలకు రాష్ట్రప్రభుత్వం రూ.200 కోట్ల విలువైన 5 ఎకరాల భూమి కేటాయించింది. అనుముల కొండల్‌రెడ్డి టెసరాక్ కంపెనీ ఛైర్మన్ అని లింక్‌డిన్ ప్రొఫైల్‌లో పెట్టుకున్నారు. సీఎం మరో సోదరుడు జగదీశ్‌రెడ్డి కాంట్రాక్టులు చేసుకుంటున్నారు. సీఎం బామ్మర్ది సృజన్‌రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్టు ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ షెల్ కంపెనీల బాగోతాన్ని

మిగతా2లో...



## జినోమ్ వ్యాలీలో 'యామ్జెన్' పరిశోధన కేంద్రం

మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో ఎంఓయూ

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 11 :** గ్లోబల్ దిగ్గజ బయోటెక్నాలజీ సంస్థ 'యామ్జెన్' జెనోమ్ వ్యాలీలో అత్యాధునిక పరిశోధన, ఆవిష్కరణల కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ మేరకు మంగళవారం నాడు సచివాలయంలో ఐటి, పరిశ్రమల మంత్రి

మిగతా2లో...

## నిర్ణీత గడువులోగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తి

- కారిడార్ కింద బిటి రోడ్డు పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాల్సిందే
- ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ సమీక్షలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 11 :** రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిర్ణీత గడువులోగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు పూర్తి కావాల్సిందేనని,నిర్లక్ష్యాన్ని,పనుల్లో ఆలస్యాన్ని అస్సలు సహించేది లేదని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల పురోగతిపై రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో ఆర్ అండ్ బి సి.ఈ ధర్మారెడ్డి,పలువురు అధికారులు,నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. అటు వైపు నిత్యం ప్రయాణించే వారికి ఏళ్ల తరబడి నరకప్రాయంగా మారిందని,అందుకోసమే 2026 దసరా నాటికి పూర్తి చేస్తామని ప్రజలకు మాట ఇచ్చాం...మాట ప్రకారం చేసి తీరాల్సిందేనని మిగతా2లో...

## 3.43 కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత



- ఆగస్టు 15న సంగారెడ్డి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో ఏకకాలంలో కార్యక్రమాలు
- 1.06 కోట్ల కార్డులు.. ప్రతి లబ్దిదారుడికి నెలకు 6 కిలోల ఉచిత సన్నబియ్యం
- 2025 జనవరి 26 నుంచి కొత్తగా 16.32 లక్షల ఆహార భద్రత కార్డులు
- ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఏర్పాట్లలో ఎక్కడా లోటు ఉండొద్దు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 11:** పంద్రాగస్టు రోజు సంగారెడ్డి పట్టణంలో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జనసమీకరణ, భద్రత, వేదిక తదితరాంశాలపై ఫోకస్ పెట్టింది. ఇదే అంశంపై మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్, నారాయణ్ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, సెట్విన్ చైర్మెన్ గిరిధర్ రెడ్డితోపాటు పలువురు ఉన్నతాధికారులు మిగతా2లో...

# ప్రతి విద్యార్థికి ప్రపంచస్థాయి విద్య

- యంగ్ ఇండియా స్కూల్స్ లక్ష్యం
- ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ వెల్లడి



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 11 :** తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేట్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ విద్యాలయాలు నిర్మితమవుతున్నాయని సీఎం వెల్లడించారు. 'భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వేగంగా

మిగతా2లో...




## నిషేధిత భూములపై ప్రజలు ఆందోళన చెందొద్దు

- చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం
- యుద్ధ ప్రాతిపదికన దరఖాస్తులను పరిష్కరించాలి
- నెల 14లోగా అన్ని డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేయాలి
- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో రాజీ లేదు
- సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలకు చెక్
- ఆన్‌లైన్‌లో ఉన్న వివరాల మేరకే నిర్ణయాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

# విషాదాన్ని మిగిల్చిన కొలంబియా భూకంపం

**తొలి అక్షరం/న్యూఢిల్లీ, 11:** కొలంబియాలో భారీ భూకంపం పెను విషాదాన్ని మిగిల్చింది. సోమవారం పశ్చిమ కొలంబియాలో 7.4 తీవ్రతతో ఏర్పడిన భూకంపం ధాటికి మరణించిన వారి సంఖ్య 132కు చేరింది. మరో 570 మంది గాయపడ్డారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. భూకంప కేంద్రం చోకో ప్రాంతంలోని శాన్ జోసె డెల్ పాల్మార్ సమీపంలో ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. భూకంపం సుమారు 107 కిలోమీటర్ల లోతులో సంభవించింది. దీని ప్రకంపనలు కొలంబియాలోని కాలీ, పెరీరా, మానిజాలెస్, బొగోటా తదితర ప్రాంతాలతోపాటు పొరుగు దేశాల్లోనూ నమోదయ్యాయి. భూకంప ధాటికి అనేక ప్రాంతాల్లో భవనాలు కుప్పకూలాయి. కాలీలోని ఓ ఆసుపత్రిలో పీడియాట్రిక్, నియోనేటల్ విభాగాలు దెబ్బతిన్నాయి. శిథిలాల కింద చిక్కుకున్న పలువురిని రక్షణ సిబ్బంది వెలికితీశారు. ఆసుపత్రుల్లోని కొంతమంది రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాలీలోనే 30 శాతం వరకు ఆసుపత్రి నిర్మాణం దెబ్బతిన్నట్టు స్థానిక అధికారులు తెలిపారు. పెరీరా, కాలీ నగరాల్లో భవనాల కూలిపోవడంతో భారీగా ప్రాణనష్టం సంభవించింది. మానిజాలెస్‌లోని చారిత్రక కేథడ్రల్ టవర్ ఒకటి కూలిపోయింది. పలు ఇళ్లు, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు కూడా దెబ్బతిన్నాయి. భూకంప తీవ్రత దృష్ట్యా కొలంబియా ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించింది. సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు సైనిక బలగాలను రంగంలోకి దించింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని సజీవంగా బయటకు తీసుకురావడమే తమ తొలి ప్రాధాన్యమని అధ్యక్షుడు అబెలార్డో డి లా ఎస్ప్రియెల్లా తెలిపారు. సైన్యం ప్రత్యేక శిక్షణ పొందిన రెస్క్యూ సిబ్బంది, శిథిలాల్లో చిక్కుకున్న వారిని గుర్తించే పరికరాలు, శునక దళాలను రంగంలోకి దించింది. రిమోట్ ప్రాంతాల్లో రహదారులు, సమాచార వ్యవస్థలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. భూకంపం కారణంగా పశ్చిమ కొలంబియాలోని పలు విమానాశ్రయాల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. పెరీరా, మానిజాలెస్, ఆర్మేనియా, కార్టాగో, బ్యూనవెంచురా తదితర విమానాశ్రయాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల వైద్య, ప్రభుత్వ విమానాలకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. మరోవైపు కొలంబియాకు సాయం చేసేందుకు పలు దేశాలు ముందుకొచ్చాయి. ఈక్వెడార్ 47 మంది రెస్క్యూ సిబ్బంది, శిక్షణ పొందిన శునకాలు, ప్రత్యేక పరికరాలను పంపేందుకు సిద్ధమైంది.

# నిర్ణీత గడువులోగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షలో మంత్రి పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పూర్తి జవాబుదారిగా వ్యవహరిస్తుందనీ,ఏళ్ల తరబడి అవస్థ పడుతున్న ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సురక్షిత ప్రయాణం అందించేలా చేద్దామని,అందుకు అనుగుణంగా అధికారులు మనసుపెట్టాలని ప్రత్యేకంగా కోరారు. మ్యాన్ పవర్ పెంచి..మూడు షిఫ్టుల్లో పనులు చేయాలనీ,రాత్రి వేళల్లో 11 నుండి ఉదయం 6గంటల వరకు నిరంతరాయంగా పనులు జరగాలనీ మంత్రి ఆదేశించారు.కారిడార్ కింద 6.25కి.మీ బిటి రోడ్డు పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని తేల్చి చెప్పారు. ప్రతి పది రోజులకు ఒకసారి తాను స్వయంగా క్షేత్రస్థాయి పనుల పురోగతి సమీక్షిస్తానని.. అందుకు తగ్గట్టుగా రోజువారీ వర్క్ ప్రోగ్రెస్ అధికారులు సమీక్షించాలని మంత్రి ఆదేశించారు. ÷-రస్తుతం క్షేత్ర స్థాయిలో నడుస్తున్న పనులపై మంత్రి కూలంకషంగా చర్చించారు.. సైట్ లోని కచ్చితమైన వాస్తవ పరిస్థితులు చెప్పాలని మంత్రి అధికారులు,వర్క్ ఏజెన్సీని అడిగారు. ప్రస్తుతం ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ 60? మేర పనులు పూర్తయ్యాయని మరో 40శాతం పనులు వేగంగా జరుగుతున్నాయని అధికారులు,వర్క్ ఏజెన్సీ ప్రతినిధులు వివరించారు.

ఇరువైపుల లాంచింగ్ గడ్డర్లతో పనుల్లో వేగం పెంచాలనీ మంత్రి సూచించారు. ఉప్పల్ వైపు నుండి జరుగుతున్న పనుల పురోగతిని మంత్రి ఆరా తీశారు..ఇప్పటికే ఒక స్లాబ్ పూర్తయిందని,రెండో స్లాబ్ పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాత్రిపూట పనుల వల్ల,వర్షాల వల్ల నిర్మాణం పూర్తికి మరింత సమయం పట్టే అవకాశం ఉన్నదనీ నిర్మాణ సంస్థ సమీక్ష సందర్భంగా విజ్ఞప్తి చేసింది. 2026 అక్టోబర్ 31 నాటికి అందుబాటులోకి తెస్తామని ఇప్పటికే డెడ్ లైన్ పెట్టుకున్నాం..ప్రజల ట్రాఫిక్ ఇబ్బందులు గురించి ఆలోచించాలని మంత్రి అన్నారు. వర్క్ ఏజెన్సీ విజ్ఞప్తి పట్ల మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. నుల్లో మరింత వేగం పెంచాలని,మ్యాన్ పవర్ పెంచి మూడు షిఫ్టుల్లో పనిచేయాలని తెగేసి చెప్పారు. నెలకు ఆరు స్లాబుల చొప్పున పూర్తి చేస్తామని నిర్మాణ సంస్థ మంత్రికి తెలిపింది. అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు సమాంతరంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. 2026 సంవత్సరంలో ఎట్టి పరిస్థితుల్లో ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిందేనని ఆర్ అండ్ బి అధికారులు,వర్క్ ఏజెన్సీ ఆ దిశగా పనిచేయాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

# నిషేధిత భూములపై ప్రజలు ఆందోళన చెందొద్దు

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 11:** భూముల రెగ్యులరైజ్‌కు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు జారీ చేసిన అన్ని డాక్యుమెంట్లను ఈనెల 14వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో 22ఏ అంశంపై హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్- మలాజ్‌గిరి, సంగారెడ్డి కలెక్టర్లు, జిల్లా సబ్ రిజిస్ట్రార్లతో సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిషేధిత ఆస్తుల(22ఏ) జాబితాకు సంబంధించి అపోహలను తొలగించేందుకు ప్రభుత్వం ఇప్పటి వరకు జారీ చేసిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లే-అవుట్ల అనుమతులు తదితర వివరాలతో కూడిన అన్ని డాక్యుమెంట్లను ఇందులో పొందుపరచాలని ఆదేశించారు.

# సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- **ఆటోను ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో ఏడుగురు మృతి**
- **మరో ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం**

**తొలి అక్షరం/సంగారెడ్డి,ఆగస్టు 11:** సంగారెడ్డి జిల్లాలో రెండు ఘోర రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 9మంది దుర్మరణం చెందారు. ఈ రెండు వేర్వేరు ప్రమాదాలు జిల్లాలో జరగడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. జహీరాబాద్ మండలం సత్వార్ వద్ద ఆటోను ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం పాలవగా.. మరో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. వీరంతా కర్ణాటకలోని బీదర్ జిల్లా రాజగిరికి చెందిన వ్యవసాయ కూలీలుగా గుర్తించారు. క్షతగాత్రులను జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం హుమనాబాద్ నుంచి జహీరాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.ప్రతిరోజు కూలి పని కోసం జహీరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాలకు కూలీలు వస్తూ ఉంటారు. ఆటోలో మొత్తం 14 మంది ఉన్నట్లు సమాచారం. ఆయిల్ ట్యాంకర్ హైదరాబాద్ వైపు నుంచి కర్ణాటకకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులు కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాలోని రాజగిరికి చెందినవారిగా గుర్తించారు. సమాచారం అందగానే పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోనే జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. కోహీర్ మండలం వెంకటాపూర్ కూడలి సమీపంలో 65వ నంబరు జాతీయ రహదారిపై ఓ కారు రోడ్డు డివైడర్ పైనుంచి అవతల వైపు ఎగిరి పడింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. నాలుగు వాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

# ప్రతి విద్యార్థికి ప్రపంచస్థాయి విద్య

(మొదటి పేజీ తరువాయి)

రూపుదిద్దుకుంటున్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ.. కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ.. ప్రతి చిన్నారికి ప్రపంచ స్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు.. పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా... తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా... యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి' అంటూ ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు.

# పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

పనులపై సంబంధిత అధికారులతో సీఎం మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రో సలహాలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సమ్మిట్ పెట్టుబడులపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణకు ప్లాన్ చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖులను సన్మానించాలని సూచించారు. గత ఏడాది పెట్టుబడులు, పురోగతిపై పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

# జెనోమ్ వ్యాలీలో 'యామ్జెన్' పరిశోధన కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ప్రభుత్వంతో ఎంఓయు చేసుకుంది. అంతకు ముందు శ్రీధర్ బాబుతో భేటీ అయిన యామ్జెన్ ఇండియా ప్రతినిధులు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యకలాపాల విస్తరణపై చర్చించారు. సమావేశానంతరం యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, తెలంగాణా ప్రభుత్వ పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్యలు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. జెనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేస్తున్న ఈ పరిశోధన కేంద్రంలో స్థానిక ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వెల్లడించారు. యామ్జెన్ ఇటీవల 3 వేల మంది ఉద్యోగులతో అతి పెద్ద జిసిసిని ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. ఔషధ రంగ దిగ్గజ కంపెనీలు తెలంగాణా పట్ల అపార విశ్వాసం కనబర్చడం తమ ప్రభుత్వానికి దక్కిన గౌరవమని ఆయన అన్నారు. లైఫ్ సైన్సెస్ కంపెనీలకు రాష్ట్రం ఒక ముఖ్యమైన వేదికగా మారడం పట్ల శ్రీధర్ బాబు సంతోషం వ్యక్తం చేసారు. ఉద్యోగ అవకాశాల్లో ఇక్కడి యువతకు ప్రాధాన్యతనిచ్చి నియామకాలు జరపాలని యామ్జెన్ యాజమాన్యానికి ఆయన సూచించారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, జీనోమ్ వ్యాలీ వంటి అభివృద్ధి చెందిన ఎకోసిస్టమ్ కారణంగా తెలంగాణ ప్రపంచ లైఫ్ సైన్సెస్ సంస్థలకు కీలక గమ్యస్థానంగా ఎదుగుతోందని ఆయన అన్నారు. దాదాపు 100 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న యామ్జెన్ క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఎముకల ఆరోగ్యం, ఇన్‌ఫ్లమేషన్, శ్వాసకోశ వ్యాధులు, అరుదైన వ్యాధులు తదితర తీవ్రమైన అనారోగ్య సమస్యలకు వినూత్న చికిత్సలను అభివృద్ధి చేస్తోంది. ఎంఓయు కార్యక్రమంలో పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, తెలంగాణా లైఫ్ సైన్సెస్ సిఇఓ సర్వేశ్ సింగ్ పాల్గొన్నారు.

# జేపీసీ పరిశీలనకు ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

క్రమబద్ధీకరణ (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ బిల్లు-2026పై విపక్షాలు పలు సందేహాలు లేవనెత్తిన పట్టించుకోకుండా హడవిడిగా ఆమోదించారు. దీంతో సదురు బిల్లుపై పలు రాష్ట్రాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఎఫ్‌సీఆర్ఏ బిల్లును వెనక్కి తీసుకోవాలని తమిళనాడు శాసనసభ మంగళవారం ఏకగ్రీవంగా ఒక తీర్మానం చేసింది. రాష్ట్రాలు, సంబంధిత వర్గాలతో విస్తృతంగా సంప్రదింపులు జరపాలని సూచించింది. మిజోరంలో వివిధ క్రైస్తవ మత విభాగాలకు చెందిన వేలాది మంది ఐజ్వాల్‌లో ప్రతిపాదిత సవరణలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. మిజోరం కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. ఈ విమర్శల నేపథ్యంలో ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుపై మోడీ సర్కార్ వెనక్కి తగ్గింది.విదేశీ విరాళాల క్రమబద్ధీకరణ (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ బిల్లు-2026ను సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు పంపన్నుట్లు సమాచారం. కాగా, ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లును 2026 మార్చి 25న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఎఫ్‌సీఆర్ఏ నమోదు రద్దైన, స్వచ్ఛందంగా వదులుకున్న లేదా పునరుద్ధరణ పొందని సంస్థలకు చెందిన విదేశీ విరాళాలు, ఆస్తుల పర్యవేక్షణ, నిర్వహణ, వాటి భవిష్యత్ వినియోగానికి ఒక వ్యవస్థను ఏర్పాటు చేయడం దీని లక్ష్యం. చట్టంలోని జరిమానా విధానంలో మార్పులు కూడా ఇందులో ప్రతిపాదించారు. ఎఫ్ఫ్‌సీఆర్ఏ నమోదు రద్దు అయినప్పుడు లేదా పునరుద్ధరణ జరగనప్పుడు చర్చిలు, స్వచ్ఛంద సంస్థల ఆస్తులను స్వాధీనం చేసుకోవడం లేదా విక్రయించే పరిస్థితులు ఏర్పడతాయని నిరసనకారులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

# సగర్వంగా హర్ ఘర్ తిరంగా

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఆగస్టు 11:** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీమంగళవారం ఓ వీడియో పోస్టు చేశారు. ఆగస్టు 15న జెండా పండుగను ప్రజలంతా సగర్వంగా నిర్వహించుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశ ప్రజలంతా 'హర్ ఘర్ త్రివర్ణ' ప్రచారంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులర్పించాలని మోదీ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ఆగస్టు 15ని గర్వంగా జరుపుకోండి, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించండి, వికసిత్ భారత్ కోసం ప్రతిజ్ఞ చేయండి. హర్ ఘర్ తిరంగా, ఘర్ ఘర్ తిరంగా, హర్ మన్ తిరంగా' అని ఆయన పేర్కొన్నారు. అలాగే, ప్రతి ఇంటిలోనూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని మోదీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఓ వేడుకలా నిర్వహించాలని కోరారు. త్రివర్ణ పతాకం మనకు గర్వకారణమని, దేశం కోసం ఎల్లప్పుడూ సేవలందించేందుకు అది నిరంతరం స్ఫూర్తినిస్తుందని ప్రధాని చెప్పుకొచ్చారు. ఈసారి హర్ ఘర్ తిరంగా ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొని, భారత్ నిర్మాణానికి దోహదపడాలని ఆకాంక్షించారు. అలాగే, ఈ ఏడాది వందేమాతరం జాతీయ గీతం ఇతివృత్తంగా వేడుకలు నిర్వహించనున్నట్లు మోదీ పేర్కొన్నారు.

# రేవంత్ షెల్ కంపెనీల బాగోతం త్వరలోనే బండారం బయటపెడతాం

(మొదటి పేజీ తరువాయి)

బయటపెడతామని హెచ్చరించారు.మంగళవారంతెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. అనుముల కొండల్‌రెడ్డి టెస్రాక్ట్ సంస్థకు చైర్మన్‌గా ఉన్నానని ఆయనే చెప్పారని అన్నారు. రేవంత్ బ్రదర్స్ సూటు బూట్లతో కంపెనీలు ఎలా పెట్టారని ప్రశ్నించారు. టెస్రాక్ట్ కంపెనీలో ఒక్క ఎంప్లాయీ కూడా లేరని.. లక్ష రూపాయలతో ఆ కంపెనీ పెట్టడం ఎలా సాధ్యమని నిలదీశారు. ఆ కంపెనీకి వేల కోట్ల భూములు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. రూ.2వేల కోట్ల విలువ చేసే స్థలాన్ని రూ.7 వేల కోట్లకు కేటాయించారని ప్రస్తావించారు. ఆ కంపెనీకి కొండల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు ఎలా చెబుతారని నిలదీశారు. శ్రీధర్‌బాబుకి తన శాఖలో ఏం జరుగుతుందో తెలియదా.? లేక సీఎం వత్తిడికి తలొగ్గరా అని ప్రశ్నల వర్షం కురిపించారు. కర్ణాటకలో అక్కడి ప్రభుత్వం సీఎం భార్యకు మూడెఎకరాలు కేటాయించడంపై కేసు నమోదైందని తెలిపారు. ముడా స్కాంలో సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. అనుముల కొండల రెడ్డి టెస్రాక్ట్ సంస్థ కి చైర్మన్‌గా ఆయనే పేర్కొన్నారు. కొండల్‌రెడ్డికి సంబంధం లేకుంటే యూఎస్ కౌన్సిల్ మీటింగ్‌కి ఎలా వెళ్లారని నిలదీశారు. ఈ భూ కేటాయింపులను వదలబోమని వార్నింగ్ ఇచ్చారు. తిరుపతిరెడ్డి ఏ హోదాలో అధికారిక సమావేశాలకు వెళ్తారని ప్రశ్నించారు. ప్రజలకు పట్టాలు ఏ హోదాలో ఇస్తారని నిలదీశారు. రాష్ట్ర గవర్నర్‌నీ కలిసి ఈ విషయంపై విచారణ జరపాలని కోరతామని అన్నారు. 74 లక్షల ఓట్లు తొలగిస్తారనేది ఆందోళనకరమైన విషయమని చెప్పుకొచ్చారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల తర్వాత పార్టీ నేతలు న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అర్హుల ఓట్లు కోల్పోకుండా చూస్తామని అన్నారు. తెలంగాణకు అన్యాయం చేసే జీఆర్ఎంబీ మీటింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం వెళ్తుందా లేదా స్పష్టం చేయాలన్నారు. జలసౌదాలో జరిగే జీఆర్ఎంబీ అజెండా మార్చుకుంటే జలసౌధను ముట్టడిస్తామని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కి జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్ర చెప్పినా బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. వరుణ యాగం చేయడం తప్పు కాదు కానీ ప్రభుత్వం చేయాల్సిన పని చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు.

# 3.43 కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లతోనూ మంత్రి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైరల్ ఫీవర్‌తో బాధపడుతుండటం వల్ల ఈ సమావేశానికి హాజరుకాలేకపోయారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సంగారెడ్డి బహిరంగ సభను జయప్రదం చేసేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. జన సమీకరణ, భద్రత, ఇతర ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించనున్నట్టు తెలిపారు.అదే రోజు ఏకకాలంలో అన్ని జిల్లాల్లో కార్డులను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాల నుంచి మొత్తం పది మంది లబ్దిదారులకు సీఎం స్వయంగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తారని తెలిపారు. ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను ఆదేశించారు. స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల రాష్ట్రంలోని 3.42 కోట్ల మంది అర్హులైన లబ్దిదారులు ప్రయోజనం పొందనున్నారని చెప్పారు. ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా ప్రతి అర్హుడికి ప్రతి నెలా ఆరు కిలోల నాణ్యమైన సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం పంపిణీ చేస్తున్నదని తెలిపారు. సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని ఇందుకోసం సరఫరా చేస్తోందని చెప్పారు. స్మార్ట్ కార్డుల ద్వారా రాష్ట్రంలో ఆహార భద్రతను మరింత బలోపేతం చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి ఆహార భద్రతను కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు జిల్లా కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పంతంగిలో జడ్పీ సీఈవో శోభారాణి పర్యటన



**తొలి అక్షరం/చౌటుప్పల్ ఆగస్టు 11:** పంతంగి గ్రామాన్ని జిల్లా పరిషత్ సీఈవో శోభారాణి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థినీ విద్యార్థులకు స్కూల్ డ్రెస్‌లను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అదేవిధంగా గ్రామంలో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన జడ్పీ సీఈవో, పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల వివరాలను సంబంధిత హౌసింగ్ ఏఈ పవన్ కళ్యాణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతి, పెండింగ్ పనులపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మండల ఎంపీడీవో శ్రీలత, గ్రామ సర్పంచ్ శ్రీలత సుందర్, పంచాయతీ కార్యదర్శి పద్మజ, హౌసింగ్ ఏఈ పవన్ కళ్యాణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ పెన్షన్లు ఇవ్వాలి

**ఆగస్టు 12న మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాను జయప్రదం చేయాలి**

**సీపీఎం మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్**




**తొలి అక్షరం/చౌటుప్పల్: ఆగస్టు 11:** చౌటుప్పల్ మున్సిపాలిటీలో అర్హులైన పేదలందరికీ అన్ని రకాల పెన్షన్లు మంజూరు చేయాలని, పెన్షన్ల సాధన కోసం ఆగస్టు 12న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం పార్టీ మున్సిపల్ కమిటీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా సీపీఎం మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నా అభివృద్ధి మాత్రం శూన్యంగా ఉందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీసం అర్హులైన పేదలందరికీ అన్ని రకాల పెన్షన్లు మంజూరు చేసి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు "ఓడ దాటినాక ఓడ మల్లయ్య.. ఓడ దాటాక బోడ మల్లయ్య" అన్న చందంగా ఉందని విమర్శించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలో పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన పేదలకు వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించే ధర్నాలో పేదలు, వృద్ధులు, వికలాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కరుణాకర్ కోరారు. పెన్షన్ల సాధన కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండీ పాషా, నాయకులు బండారు నరసింహ, గోపగోని లక్ష్మణ్ గౌడ్, ఎండీ ఖయ్యూం, ఆకుల ధర్మయ్య, తూర్పునూరి మల్లేశం, సప్పిడి శ్రీనివాసరెడ్డి, బాతరాజు దశరథ, బొడ్డు రాజు, గుణమోని ఐలయ్య, బొమ్మకంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- చౌటుప్పల్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం
- జి. మన్మధ కుమార్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ చౌటుప్పల్




**తొలి అక్షరం/చౌటుప్పల్, ఆగస్టు 11:** యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలోని సవారియా కంపెనీలో మంగళవారం సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మధ కుమార్ పాల్గొని కంపెనీ ఉద్యోగులు, ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీ , పిన్ , సి వి వి,పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని, గుర్తుతెలియని లింకులు, మెసేజ్‌లు, ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని తెలిపారు. ఆన్‌లైన్ పెట్టుబడులు, ఉద్యోగాలు, రివార్డులు, లోన్లు తదితర పేర్లతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యూ పి ఐ ద్వారా డబ్బులు పంపే ముందు ఖాతా వివరాలను తప్పనిసరిగా సరిచూసుకోవాలని తెలిపారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు సమాచారం అందించాలని సూచించారు. సైబర్ నేరాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించడంతో పాటు సైబర్ భద్రతపై అవగాహన పెంచుకోవాలని ఇన్‌స్పెక్టర్ జి. మన్మధ కుమార్ కోరారు.

## అంగన్వాడీ ఆయా మృతి.. సిబ్బంది ఆర్థిక చేయూత

**- మృతురాలి కుటుంబానికి రూ.21 వేల సాయం**

**తొలిఅక్షరం/నర్సింహులపేట ఆగస్టు12 :** మరిపెడ ప్రాజెక్టు కౌంసల్యాదేవిపల్లి సెక్టార్ పరిధిలోని జయపురం గ్రామం రెండో అంగన్వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న చుక్క మంగమ్మ మృతి చెందారు. ఆమె మృతిచెందిన విషయం తెలుసుకున్న తోటి అంగన్వాడీ టీచర్లు, ఆయాలు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి తమ వంతుగా రూ.11 వేల ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా ఐసీడీఎస్ కార్యాలయం తరఫున ఏసీడీపీఓ తేజ కల్యాణి, సూపర్‌వైజర్ మంగాదేవి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం మృతురాలి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో మృతురాలి కుటుంబానికి తోటి సిబ్బంది అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు సమ్మెట లలిత, కవిత, రమ, భారతమ్మ, యాకమ్మ, మాధవి తదితర కౌంసల్యాదేవిపల్లి సెక్టార్ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



# ఫీజులు వేలల్లో.. విద్యార్థుల భద్రత మాత్రం ప్రశ్నార్థకం!

**శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలపై**

**సమగ్ర తనిఖీలు చేపట్టాలి**

**నిబంధనలు ఉల్లంఘిస్తే గుర్తింపు**

**రద్దు చేయాలి:ఎస్ఎఫ్ఐ**




**తొలి అక్షరం/చౌటుప్పల్:ఆగష్టు 11:** చౌటుప్పల్ పట్టణం లోని శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలలో విద్యార్థుల భద్రత, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లపై నెలకొన్న అనుమానాల నేపథ్యంలో అధికారులు తక్షణమే కళాశాలను తనిఖీ చేసి వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తేవాలని ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల నుంచి బుక్స్, యూనిఫామ్ పేరుతో సుమారు రూ.20 వేల వరకు వసూలు చేయడంపై ఉన్న శ్రద్ధ, విద్యార్థుల ప్రాణ భద్రత కల్పించడంలో ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. ఫీజుల వసూళ్లలో వేగం చూపుతున్న యాజమాన్యం, భద్రతా ఏర్పాట్ల విషయంలో మాత్రం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. కళాశాలలో ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని ఫైర్ సేఫ్టీ అధికారులు తక్షణమే ప్రత్యక్షంగా పరిశీలించాలని కోరారు. ముఖ్యంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో అగ్ని ప్రమాదం జరిగితే ఫస్ట్, సెకండ్ ఫ్లోర్‌లలో ఉన్న విద్యార్థులు సురక్షితంగా బయటకు వచ్చే అత్యవసర మార్గాలు, ఎగ్జిట్ సౌకర్యాలు ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించాలన్నారు. విద్యార్థులను అత్యవసర పరిస్థితుల్లో సురక్షితంగా బయటకు తీసుకురావడానికి అవసరమైన ఫైర్ సేఫ్టీ పరికరాలు, ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు, భద్రతా ప్రణాళికలు అందుబాటులో ఉన్నాయా లేదా అన్నదానిపై సమగ్ర తనిఖీ చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు కూడా కళాశాలను తనిఖీ చేసి మంజూరైన సీట్ల సంఖ్య, వాస్తవ విద్యార్థుల సంఖ్య, ఒక్కో గ్రూపులో విద్యార్థుల సంఖ్య, తరగతుల నిర్వహణ, అర్హత కలిగిన బోధనా సిబ్బంది తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. కేవలం కార్యాలయాల్లో ఫైళ్లను పరిశీలించడం కాకుండా అధికారులు కళాశాలకు ప్రత్యక్షంగా వెళ్లి విద్యార్థుల భద్రత, సీట్ల పరిమితి, బోధనా సిబ్బంది, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు, ఫీజుల వసూళ్లు తదితర అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని తిగుళ్ళ శ్రీనివాస్ అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజుల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేయడమే కాకుండా, వారి పిల్లల ప్రాణ భద్రతకు కూడా పూర్తి బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. అధికారుల తనిఖీల్లో నిబంధనల ఉల్లంఘనలు తేలితే సంబంధిత యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే శ్రీ గాయత్రి జూనియర్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. విద్యార్థుల ప్రాణ భద్రత విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, అధికారులు తక్షణమే స్పందించి కళాశాలపై సమగ్ర తనిఖీలు చేపట్టాలని తిగుళ్ళ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సుర్వి అరవింద్, వంశీ, నితిన్, లోకేష్, తేజ పాల్గొన్నారు.

# గర్భిణీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల సేవ**

**ఆధ్వర్యంలో అవగాహన సదస్సు**

**ముఖ్య అతిథులుగా పాల్గొన్న డాక్టర్లు**

**డా. ప్రశాంతి రెడ్డి, డా. వై సూర్య శ్రీ ,**

**డా. అవ్వారు శ్రీనివాస్ ప్రసాద్**







**తొలి అక్షరం/చౌటుప్పల్, ఆగస్టు 11:** చౌటుప్పల్ మున్సిపాలిటీ తంగడపల్లి రోడ్డులోని కళాశ్రీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల సేవ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల సేవ అధ్యక్షులు ఎం.డి. అత్‌హర్ పాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి లయన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దాచేపల్లి ప్రకాష్ గుప్తా ముఖ్యఅతిథిగా, లయన్స్ క్లబ్ నల్లగొండ జిల్లా రీజియన్ చైర్‌పర్సన్ సంజీవరెడ్డి, జోన్ చైర్మన్ ఉప్పు ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ వై. సూర్యశ్రీ, డాక్టర్ ప్రశాంతి రెడ్డి, డాక్టర్ అవ్వారు శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ గర్భిణీలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. ఐరన్, ఫోలిక్ యాసిడ్, కాల్షియం వంటి మందులను వైద్యుల సూచనల ప్రకారం మాత్రమే వినియోగించాలని సూచించారు. గర్భిణీలకు సురక్షితమైన తాగునీరు, పోషకాహారం, తగిన విశ్రాంతి, పరిశుభ్రమైన వాతావరణం ఎంతో అవసరమని తెలిపారు. అధిక రక్తపోటు, రక్తస్రావం, తీవ్రమైన తలనొప్పి, కాళ్లలో అధిక వాపు, చూపు మసకబారడం, బిడ్డ కదలికలు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రతి గర్భిణీకి సురక్షితమైన గర్భధారణ, ఆరోగ్యకరమైన ప్రసవం, తల్లిబిడ్డల ఆరోగ్యం కోసం కుటుంబ సభ్యులు సహకరించాలని, గర్భిణీల ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి దాచేపల్లి రాజు గుప్తా, కోశాధికారి బత్తిని రఘు, నాంపల్లి రమేష్ గుప్తా, తిరందాసు జగన్నాథ్, కాసుల వెంకటేశం గౌడ్, కామిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, గొప్పగోని లక్ష్మణ్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, సిలివేరు మంగయ్య, వనం రాజు, సంపూర్ణ చారి, పోలోజు రాజు, పోలోజు శ్రీనివాస చారి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ వద్దు

**జీవో 641ను వెంటనే**

**రద్దు చేయాలి**

**డంపింగ్ యార్డ్‌తో ప్రజారోగ్యం, పర్యావరణానికి తీవ్ర ముప్పు**

**జీవో రద్దు చేసే వరకు ప్రజా ఉద్యమం కొనసాగుతుంది: మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌లిలా**






**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు11:** కొత్తూర్ మండలం సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం జారీ చేసిన జీవో నంబర్ 641ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల భవిష్యత్తులో ప్రజలకు, పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ జేఏసీ ఆధ్వర్యంలో కొత్తూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే చెత్త నుంచి వెలువడే దుర్వాసన, దుమ్ము, పొగతో పాటు హానికర వాయువుల కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. చెత్తలోని వ్యర్థాలు భూమిలోకి, భూగర్భ జలాల్లోకి చేరితే నీటి కాలుష్యం ఏర్పడి తాగునీరు, వ్యవసాయ భూములు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల ఈగలు, దోమలు, క్రిమి కీటకాలు వంటి వ్యాధి కారకాలు పెరిగి ప్రజారోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. చెత్తను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించకపోతే భూసారం దెబ్బతినడం, పంటలపై ప్రతికూల ప్రభావం పడటం, పరిసరాల పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతాయని అన్నారు. గ్రామాల మధ్య డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో ఆ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం సరికాదని అంజయ్య యాదవ్ అన్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణం కంటే ఏ అభివృద్ధి కార్యక్రమం ముఖ్యమైనది కాదని స్పష్టం చేశారు. ఈ ధర్నాలో పౌర హక్కుల సంఘాల నాయకులు, జేఏసీ కమిటీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బీఆర్ఎస్ శ్రేణులు, సిద్ధాపూర్ పరిసర గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. డంపింగ్ యార్డ్ జీవోను రద్దు చేయాలని నినాదాలు చేస్తూ ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. జీవో నంబర్ 641ను రద్దు చేసే వరకు ప్రజా ఉద్యమం కొనసాగుతుందని, అవసరమైతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని అంజయ్య యాదవ్ స్పష్టం చేశారు.

# ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

### చౌదరిగూడెం ఉన్నత పాఠశాలలో యూనిఫామ్స్, షూస్, హైజీన్ కిట్ల పంపిణీ





**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 11:** చౌదరిగూడెం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నూతన స్కూల్ యూనిఫామ్స్, షూస్, హైజీన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ శ్వేతా చంద్రబాబు, మండల తహసీల్దార్ జగదీష్, మండల విద్యాశాఖ అధికారి కిరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఏమాత్రం తీసిపోరని అన్నారు. విద్యార్థుల అభివృద్ధికి, వారికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. 202627 ఆర్థిక సంవత్సరానికి విద్యాశాఖకు రూ.26,674 కోట్ల బడ్జెట్ కేటాయించడం ద్వారా విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న ప్రాధాన్యత స్పష్టమవుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు పలు మార్పులు తీసుకువస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్స్, షూస్, పుస్తకాలు, హైజీన్ కిట్లు అందించడం అభినందనీయమన్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. డిప్యూటీ సర్పంచ్ హజార్ అలీ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునిత, ఎస్ఎంసీ చైర్మన్ లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దామోదర్, మాజీ వైస్ ఎంపీపీ యాజజ్, ఉప సర్పంచ్ హాజర్ అలీ, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ నాయకులను కలిసిన బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు విట్యాల నరసింహా



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 11:** బీజేపీ రంగారెడ్డి రూరల్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా విట్యాల నరసింహ జిల్లాలోని పార్టీ సీనియర్ నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై సీనియర్ నాయకులతో చర్చించారు. పార్టీ అభివృద్ధి, ఎస్సీ మోర్చా బలోపేతం, కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై వారి సలహాలు, సూచనలు తీసుకున్నారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని నరసింహ తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా నాయకుడు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ క్షేత్రంలో కృష్ణవేణీ పాఠశాల విద్యార్థుల క్షేత్ర స్థాయి పర్యటన

### రైతు శ్రమ, వ్యవసాయ విధానాలపై విద్యార్థులకు అవగాహన





**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు11:** స్థానిక కృష్ణవేణీ పాఠశాలకు చెందిన 8, 9వ తరగతి విద్యార్థులు వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకునేందుకు క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి రఫత్ సుల్తానా ఆధ్వర్యంలో శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన రైతు, గ్రామ సర్పంచ్ శ్రీ రమేశ్, డిప్యూటీ సర్పంచ్ శ్రీ సయ్యద్ ముస్తఫా ఆధ్వర్యంలో విద్యార్థులను వ్యవసాయ క్షేత్రానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులు పంటల నాట్ల దశ నుంచి దిగుబడి వరకు జరిగే వివిధ ప్రక్రియలను ప్రత్యక్షంగా పరిశీలించారు. రైతులు పంట సాగులో ఎదుర్కొనే సమస్యలు, వారి శ్రమ, కష్టనష్టాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్ వ్యవసాయానికి అవసరమైన నేల రకాలు, వ్యవసాయ పనిముట్లు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా మాట్లాడుతూ.. భారతదేశానికి వ్యవసాయమే ప్రధాన ఆధారమని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో రైతుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. సుగంధ ద్రవ్యాల ఉత్పత్తిలో భారతదేశం ప్రథమ స్థానంలో ఉందని పేర్కొన్నారు. తరగతి గదిలో పాఠ్యాంశాలను బోధించడం కంటే క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా చూపించడం ద్వారా విద్యార్థులు విషయాలను సులభంగా, త్వరగా అర్థం చేసుకుంటారని అన్నారు. డిప్యూటీ సర్పంచ్ సయ్యద్ ముస్తఫా మాట్లాడుతూ.. రైతులు, వ్యవసాయ కూలీలు దేశానికి వెన్నెముకలాంటి వారని అన్నారు. వ్యవసాయం ప్రాధాన్యత, రైతులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలు, వారి శ్రమ విలువను విద్యార్థులు తెలుసుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు..

# సేంద్రియ వ్యవసాయంతో నేల ఆరోగ్యం.. రైతులకు అధిక ఆదాయం

### - బూర్గుల రైతు వేదికలో సేంద్రియ సాగుపై శిక్షణ




**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు11:** బూర్గుల రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం అంటే రసాయన ఎరువులు, పురుగుమందులను నివారిస్తూ ప్రకృతి సహజ పద్ధతుల్లో పంటలు సాగు చేయడమని వివరించారు. సేంద్రియ వ్యవసాయంలో పశువుల ఎరువు, వర్మీ కంపోస్ట్, పచ్చిరొట్ట ఎరువులు, జీవ ఎరువులను వినియోగించాలని సూచించారు. పురుగుల నియంత్రణకు వేపపిండి, గోమూత్ర కషాయం, పసుపు, వేపనూనె వంటి సహజ పద్ధతులను ఉపయోగించవచ్చన్నారు. అలాగే చుక్కల నీటి పారుదల, వర్షపు నీటి సంరక్షణ ద్వారా నీటిని ఆదా చేసుకోవాలని తెలిపారు. పంట మార్పిడి, అంతర పంటల సాగు, పచ్చిరొట్ట ఎరువుల వినియోగంతో నేల సారాన్ని పెంచుకోవచ్చన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా రసాయన రహిత ఆహారం లభించడంతో పాటు నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని, పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని పేర్కొన్నారు. సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో రైతులకు అధిక ఆదాయం లభించే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా రైతు శిక్షణ సంస్థ వ్యవసాయ అధికారి రజియా సుల్తానా, ఏఈఓ కిరణ్మయి, బూర్గుల ఏఈఓ రాంబాబు, ఆత్మ ఏటీఎంలు రవీందర్, వెంకటేష్, కడియలకుంట సర్పంచ్ రాజు నాయక్, కాశిరెడ్డిగూడ సర్పంచ్ రామలింగం గౌడ్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# పెద్ది కుటుంబ సంక్షేమ బాధ్యత తీసుకుంటాం.ఈ దుఃఖం, బాధ మనందరిది

### - గటిక విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పెద్ది స్వప్న, పిల్లలు, సోదరులను కలిసిన నెక్కొండ మిత్ర బృందం



**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 11:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రం నుండి ఇటీవల హార్ట్ ఎటాక్ తో మరణించిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి– స్వప్న లను పరామర్శించడంతోపాటు పెద్ది కుటుంబాన్ని ఓదార్చిన జెడ్పీ మాజీ కో ఆప్షన్ ఎస్కే అబ్దుల్ నబి, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి శివ కుమార్, రామాలయ కమిటీ మాజీ అధ్యక్షుడు గన్ను కృష్ణ, బి ఆర్ ఎస్ నాయకుడు ఈదునూరి వెంకటేశ్వర్లు, పి ఆర్ టి యు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాపోలు యాకయ్య, తదితరులు పెద్ది కుటుంబ సభ్యులకు పరామర్శించిన వారిలో ఉన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి తో ఉన్న రెండున్నర దశాబ్దాల అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మిత్రబృందం హామీ ఇచ్చింది.

# దాతల సహకారం అభినందనీయం



### - గర్దాసు విక్రమ్ సర్పంచ్ ఇంద్రపాలనగరం

**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 12:** రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామంలో 2026 విద్యా సంవత్సరంలో 65 మంది నూతన విద్యార్థులు పాఠశాలలో చేరడంతో మరుగుదొడ్లు సరిపోక విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ గర్దాసు విక్రమ్ బోయిని చిన్న మల్లేశం దాత సహకారంతో బోయిని సుబ్రమణ్యం జ్ఞాపకం గా మరుగుదొడ్ల మరమ్మత్తుల కోసం 35 వేల రూపాయలు వారి కుటుంబ సభ్యులు గ్రామ సర్పంచ్ గర్దాసు విక్రమ్ ప్రధానోపాధ్యాయులకి ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు ఉప సర్పంచ్ నల్ల జయసుధ స్వామి సింగన బోయిన గణేష్ యాదవ్ రాస వెంకటేశం మాజీ ఏఎంసి డైరెక్టర్ గర్దాసు కరుణాకర్ నిమ్మన గడ్డ పద్మారావు మేకల నరేందర్ పాల సంఘం చైర్మన్ కంబాలపల్లి శ్రీశైలం మాదం నాగేష్ భువనగిరి మధు వడ్లకొండ చింటూ ప్రధానోపాధ్యాయులు శేఖర్ ఉపాధ్యాయులు మని గణేష్ సాయి పాల్గొన్నారు

# సమన్వయంతో గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు

### - జలశ్రీ, పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 11:** రంగారెడ్డి జిల్లా గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అన్ని లైన్ డిపార్ట్‌మెంట్లు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ కె. కిరణ్మయి అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో GP SAP, 202627 GPDP, BPDP, DPDP, జలశ్రీ, వనమహోత్సవం, పారిశుధ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ప్రతి గ్రామానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించి, ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యతా పనులను చేపట్టాలని సూచించారు. ఈ నాళ్రాలో గ్రామంలోని మౌలిక వసతులు, తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, నీటి వనరులు తదితర వివరాలను పొందుపరచాలని తెలిపారు. జలశ్రీ కింద ఫార్మ్ పాండ్స్, సోక్‌పిట్స్, పెర్కొలేషన్ ట్యాంకులు నిర్మించి వర్షపు నీటిని సంరక్షించాలని ఆదేశించారు. వనమహోత్సవంలో నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక బాధ్యతలు కేటాయించాలని, గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించి సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రణాళికలు క్షేత్రస్థాయిలో ఫలితాలు ఇచ్చేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

# కరీంనగర్‌లో 13న తాగునీటి సరఫరాకు అంతరాయం

### - పంప్‌హౌస్‌లలో మరమ్మతులు.. నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని నగరపాలక సంస్థ సూచన

**తొలి అక్షరం/కరీంనగర్, ఆగస్టు 11:** కరీంనగర్ నగరంలోని ఫిల్టర్ బెడ్ వద్ద 150 హెచ్‌పీ, 350 హెచ్‌పీ పంప్‌హౌస్‌లలో మరమ్మతు పనులు జరుగుతున్నట్లు నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 13, గురువారం రోజున నగరంలోని లో లెవెల్ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. సంబంధిత ప్రాంతాల ప్రజలు ముందస్తుగా తాగునీటిని నిల్వ చేసుకుని, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని నగరపాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజ్ఞప్తి చేశారు.

# సెయింట్ థెరిస్సా హై స్కూల్ నుండి ఐరిస్ హెల్త్ సొసైటీ వారికి ఆర్థిక సహాయం

### - ప్రిన్సిపల్ -కరస్పాండెంట్ చల్లా మమత యాకుబ్ రెడ్డి



**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 11:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని సెయింట్ థెరిస్సా హై స్కూల్ నుండి చెవిటి, గుడ్డి అనాద,పిల్లల సహాయం కోసం ఐరిస్ హెల్త్ సొసైటీ వారికి సెంట్ తెరిస్సా హై స్కూల్ విద్యార్థిని,విద్యార్థులచే విరాళంగా ఆర్థిక సహాయాన్ని అందించే విధంగా సహకరించిన సెయింట్ థెరిస్సా హైస్కూల్ కరస్పాండెంట్ –ప్రిన్సిపల్ చల్లా మమతా యాకూబ్ రెడ్డి ఆధ్వర్యంలో పేద విద్యార్థిని,విద్యార్థులకు గుడ్డి,చెవిటి, మూగ వారికి విరాళంగా సేకరించిన డబ్బులను పేద పిల్లల యొక్క సహకారం కోసం అందించడం జరిగింది.అదేవిధంగా పిల్లలు ఆర్థిక సహాయం అందించినందుకు గాను ఐరిష్ సొసైటీ నుండి షీల్డు, గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ల ను బహుకరించడం జరిగింది . ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు మాధవి, స్వప్న, మౌనిక,కవిత పుష్పలత,అనిత, పి,కవిత,శ్రావణి,లావణ్య, సబితా,రచన, శ్రీహరి, రమేష్,శ్రీకాంత్, దేవేందర్, సుధాకర్, కృపాకర్, మిగతా విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మునగ కోటయ్య మృతి చాలా బాధాకరం: దైద రవీందర్






**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 12:** కేతేపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన యాదవ సంఘం అధ్యక్షుడు నమస్తే తెలంగాణ రిపోర్టర్ అయిన మునగ లింగమల్లు తండ్రి అయిన మునగ కోటయ్య మరణించగా వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన దైద రవీందర్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిఈ కార్యక్రమంలో గార్లపాటి రవీందర్ రెడ్డి నకిరేకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జటంగి వెంకటనరసింహా యాదవకేతేపల్లి మాజీ జెడ్పీటీసీ సైదులు యాదవ్, నరేష్, ప్రవీణ్,మహేష్, నర్సింహ యాదవ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ రాజ్యాంగ హక్కులు,బాధ్యతలను తెలుసుకోవాలి

## వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** హనుమకొండ కేడీసీలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత,హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పాల్గొన్నారు.రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు పౌరులుగా మన బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు.హనుమకొండ లోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార,ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సి బి సి)వరంగల్ ఫీల్డ్ కార్యాలయం ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' పై రెండు రోజుల ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ అండ్ ఔట్రీచ్ ప్రోగ్రాం (ఐ సి ఒ పి),ఫోటో ఎక్సిబిషన్ ను పోలీస్ కమిషనర్,జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన అనంతరం వరంగల్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ తరుణ్ కుమార్ బోడా సీబీసీ రూపొందించిన జాతీయ పతాకం యొక్క ప్రస్థానం,స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల పై ఫోటో ఎగ్జిబిషన్‌లోని అంశాలను వివరించారు.అనంతరం విద్యార్థులను ఉద్దేశించి పోలీస్ కమిషనర్ ప్రసంగిస్తూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం,రాజ్యాంగ విలువలను కాపాడటంతో పాటు దేశ అభివృద్ధిలో యువత క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని సూచించారు.మన రాజ్యాంగంలో రాసుకున్న హక్కులు,బాధ్యతలు ఏవైతే ఉన్నాయో పౌరులుగా మన బాధ్యత ఏంటి అనేవి ఇలాంటి కార్యక్రమాలు మనకి గుర్తు చేస్తాయన్నారు.ఎప్పుడూ మనం హక్కుల కోసం పోరాడడం అనేది ఒక నాణేనికి ఒక వైపు మాత్రమే.ఇంకోవైపు మన బాధ్యత ఏముంది అనేది తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు.మనకి దక్కిన స్వాతంత్ర్యానికి మనం గౌరవం,విలువ ఇస్తూ,భవిష్యత్తు తరాలకి ఎటువంటి సమాజాన్ని అందిస్తామో అనేది మనపైనే ఆధార పడి ఉంటుందన్నారు.దేశాభివృద్ధి,భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందన్నారు.మిమ్మల్ని మీరు ఎలా మలుచుకుంటారు అనేది మీ చేతుల్లోనే ఉంటుందని యువతను ఉద్దేశించి అన్నారు.మీ జీవితాలు మీరు ఎలా మలుచుకుంటారు అనేది వందకి వంద శాతం మీ చేతుల్లోనే ఉంటుందని,కష్టపడి మన జీవితాన్ని మనమే మెరుగుపరచుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూలి కేంద్ర సమాచార,ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.అలాగే క్విజ్,వక్తృత్వ,వ్యాసరచన పోటీలలో విద్యార్థులు చాలామంది ఉత్సాహంగా పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు.భారత స్వాతంత్ర్య పోరాటం,స్వాతంత్ర్యం కోసం జరిగిన త్యాగాలు,పోరాటాల జ్ఞాపకాలు ఎప్పటికీ గుర్తుంచుకోవాలన్నారు.స్వతంత్ర భారతదేశంలో జన్మించడం మన అదృష్టం అని అన్నారు.ఇంత గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థను వారసత్వంగా పొందడం మనకు లభించిన గొప్ప అవకాశమని తెలిపారు. మన రాజ్యాంగాన్ని పొందడం మన అదృష్టం అని పేర్కొన్నారు.ప్రాథమిక హక్కులు,ప్రాథమిక విధులు మనకు








ఉన్నాయని అన్నారు.దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 15వ తేదీని,జనవరి 26వ తేదీని ఎంతో ఘనంగా జరుపుకుంటామని,ఇలాంటి కార్యక్రమాలను కూడా ప్రతి సంవత్సరం స్వాతంత్ర్యం వెనుక ఎంతటి కృషి,త్యాగం,పోరాటం దాగి ఉందో మనం ఎప్పటికీ మరచిపోకూడదనే ఉద్దేశంతో నిర్వహిస్తుంటామని అన్నారు.మనం ఈరోజు చూస్తున్న జాతీయ పతాకం ఒక్క రోజులో రూపుదిద్దుకున్నది కాదు అని దాని వెనుక ఎన్నో సంవత్సరాల కృషి,ఎన్నో పోరాటాలు ఉన్నాయని తెలిపారు.మనం పొందిన స్వేచ్ఛను,మనకు లభించిన ఈ ప్రజాస్వామ్య వ్యవస్థను ఎంతో కృతజ్ఞతతో గుర్తుంచుకోవాలని అన్నారు.మనకు లభించిన ఈ స్వేచ్ఛను కాపాడుకోవడంతో పాటు,భవిష్యత్ తరాలకు మరింత బలమైన ప్రజాస్వామ్యాన్ని అందించేందుకు మన వంతు కృషి చేయాలన్నారు.కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర సమాచార శాఖ ఆద్వర్యం లో నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' పై పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు.విద్యార్థులలో దేశం పట్ల బాధ్యత పెంపొందించటానికి ఇటువంటి కార్యక్రమాలు అవసరం అన్నారు.ఈ కార్యక్రమం లో కళా బృందాలు 'హర్ ఘర్ తిరంగా' పై ప్రదర్శించిన యక్షగానం విద్యార్థులను ఆకట్టుకుంది.క్విజ్,వక్తృత్వ,వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పోలీస్ కమిషనర్,జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రజనీ లత,ప్రోగ్రామ్ ఇన్చార్జి సమత,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా.. ఆర్థిక సాయం అందించిన సర్పంచ్ గర్ధాస్ విక్రమ్

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం

**తొలి అక్షరం/రామన్నపేట, ఆగస్టు 12:** ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ తన సేవా దృక్పథాన్ని చాటుకుంటున్నారు ఇంద్రపాలనగరం గ్రామ సర్పంచ్ గర్ధాస్ విక్రమ్. గ్రామానికి చెందిన ఎర్ర నర్సమ్మ అకాల మరణం చెందడంతో విషయం తెలుసుకున్న సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ వెంటనే మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన సర్పంచ్.. కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ తన వంతు సహాయంగా రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్ట సమయంలో కుటుంబానికి ఆర్థికంగా, మానసికంగా అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని సర్పంచ్ తెలిపారు.గ్రామ ప్రజలకు ఏ ఆపద వచ్చినా అందుబాటులో ఉంటూ వారికి తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ



ముందుంటానని గర్ధాస్ విక్రమ్ పేర్కొన్నారు. మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించడం పట్ల గ్రామస్తులు సర్పంచ్‌ను అభినందించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, అవసరమైన సమయంలో స్పందిస్తూ సేవా కార్యక్రమాల్లో ముందుండే సర్పంచ్ గర్ధాస్ విక్రమ్‌ను పలువురు ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, వార్డు సభ్యులు వడ్లకొండ మల్లేశం, పుట్టల ముత్యాలు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ మందడి విద్యాసాగర్ రెడ్డి, మంటి లింగస్వామి, ఈర్లపల్లి మల్లయ్య, మాజీ ఉపసర్పంచ్ సింగణబోయిన



జంగయ్య, గర్ధాస్ సిద్దయ్య, మాజీ ఏఎంసీ డైరెక్టర్ గర్ధాస్ కరుణాకర్, మందడి శ్రీధర్ రెడ్డి, పాలసంఘం చైర్మన్ కంబాలపల్లి శ్రీశైలం, రాజన్నగారి మురళి, మాజీ వార్డు సభ్యులు నిమగడ్డ పద్మారావు, ఈర్లపల్లి రమేష్, చిన్నపాక సురేష్, నల్ల రామస్వామి, కాటేపల్లి మహేష్, మంటి బిక్షపతి, మాధం నాగేష్, కూకుట్ల సత్తయ్య, నల్ల రమేష్, తంగేడి పెళ్లి ఎల్లయ్య, నల్ల చంద్రయ్య, చినలచ్చి శంకరయ్య, బొల్ల మత్స్యగిరి, నల్ల మల్లయ్య, నల్ల మహేష్, వెలిమినేటి నరేష్, భువనగిరి మధు, మట్ట యాదయ్య, సింగణబోయిన మత్స్యగిరి, రాజన్నగారి ఆదిత్య, గర్ధాస్ సాయి, గర్ధాస్ శ్రీకాంత్, వడ్లకొండ చింటూ, నల్ల గిరిబాబు, భువనగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మండల తహసిల్దార్‌కు పెద్దివిగ్రహాన్ని ప్రతి గ్రామానికి ప్రతిష్టాపనకు వినతిపత్రం అందజేత

- నెక్కొండ బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సంఘవి సూరయ్య.





**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 11:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం లోని అన్ని గ్రామాలలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ప్రతిష్ఠాపనకు అనుమతి కోరుతూ నెక్కొండ మండల తహసిల్దార్ కి వినతి పత్రం సమర్పించడం జరిగింది.నెక్కొండ మండలం లో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరుతూ వరంగల్ జిల్లా నెక్కొండ మండల ఎమ్మార్వో కి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో నెక్కొండ మండల పార్టీ అధ్యక్షుడు సంగని సూరయ్య ,మండల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి శివ కుమార్,మాజీ వైస్ ఎంపీపీ ధోనికేనా సారంగపాణి,మండల నాయకులు కారింగుల సురేష్ గౌడ్,మాజీ రామాలయం కమిటీ చైర్మన్ పొడిశెట్టి సత్యం,దాసరి శ్రీనివాస్,ఈదునూరి వెంకన్న,మాజీ సర్పంచులు మాదాసు రవి,జల్లే సుదర్శన్,ముదిగొండ సర్పంచ్ పున్నం రంగారెడ్డి,రెడ్లవాడ సర్పంచ్ దగ్గు గాంధీ,నాయకులు లింగ్య నాయక్,ఐలయ్య,ఈదునూరి దిలీప్,కొయ్యడ శ్రీనివాస్,లావుడ్యా నరేష్,యాకు,తేజవత్ రవీందర్,ఊళ్లేరావు ప్రభాకర్,మునిగా అశోక్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలి

- మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్ రెడ్డి
- సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు
- పెంజర్లలో ఘనంగా ఎల్లమ్మ బోనాలు



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 11:** కొత్తూరు మండలం పెంజర్ల గ్రామంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు, సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, బోనాల కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్ రెడ్డి, కొత్తూరు సీఐ నాగార్జున రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సర్పంచ్ జగన్ మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. గ్రామాలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచులు కుమ్మరి రమేష్, నందిగామ సుధాకర్, గ్రామ కమిటీ నాయకులు దేశాల రమేష్, దేశాల జైపాల్, గోవర్ధన్, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కళాశాల విద్యార్థులకు 250 స్టీల్ ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

- మధ్యాహ్న భోజన పథకానికి సేవాభావంతో సహకారం

**తొలి అక్షరం/కల్లూరు, ఆగస్టు 11 :** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తోందని వక్తలు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉపయోగపడేలా ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు సహకారంతో, పసుమర్తి సతీష్ అందించిన ఆర్థిక సహాయంతో కళాశాల విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి అవసరమైన 250 స్టీల్ ప్లేట్లు, గ్లాసులను కళాశాలలో పంపిణీ చేశారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజన సమయంలో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఈ సామగ్రిని అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.విద్యార్థుల అవసరాలను గుర్తించి సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమానికి దాతలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు మరింతగా సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్, 3వ వార్డు కౌన్సిలర్ దాసరి సుధారాణి, 15వ వార్డు కౌన్సిలర్ యాస నాగమణి శ్రీకాంత్, కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోట్రు అర్జున్ రావు, కల్లూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ ఉస్మాన్, మున్సిపల్ కౌన్సిలర్లు భూక్య రాంబాయి,పాల్గొన్నారు.

# లార్డ్ ఉదయ్ నాగరాజు తెలంగాణకు గర్వకారణం

- ప్రభుత్వ మాజీ చీఫ్ విప్,మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్




**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** బ్రిటన్ పార్లమెంటులో హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడిగా నియమితులైన తెలంగాణ కు చెందిన లార్డ్ ఉదయ్ కుమార్ నాగరాజు కు రాంనగర్ నిత్య బ్యాంకెట్ హాల్ నందు సన్మాన కార్యక్రమాన్ని తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో నిర్వహించగా.. ఈ కార్యక్రమానికి హాజరై వారిని మెమొంటోతో అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ...కరీంనగర్ జిల్లా శనిగరం గ్రామానికి చెందిన లార్డ్ ఉదయ్ కుమార్ నాగరాజు కు వరంగల్‌తో విడదీయరాని అనుభవం ఉందన్నారు.ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం హన్మకొండలోని నక్కలగుట్టలో జరిగింది.అనంతరం హైదరాబాద్,ఢిల్లీ తదితర ప్రాంతాల్లో విద్యాభ్యాసం కొనసాగించి,రాంటెక్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ (కంప్యూటర్ సైన్స్) పూర్తి చేశారు.ఉన్నత విద్యను లండన్‌లోని ఆక్స్ఫర్డ్ బ్రూక్స్ యూనివర్సిటీలో అభ్యసించారు.కేవలం 47 సంవత్సరాల వయస్సులోనే,రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారిలో హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు నియమితులైన తొలి వ్యక్తిగా ఆయన సాధించిన ఘనత తెలంగాణ ప్రజలకు,ముఖ్యంగా వరంగల్‌కరీంనగర్ ప్రాంత ప్రజలకు గర్వకారణం అని తెలంగాణ నేల నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి,బ్రిటన్ పార్లమెంటులో విశిష్ట స్థానాన్ని అలంకరించిన లార్డ్ ఉదయ్ కుమార్ నాగరాజు ను సత్కరించడం మనందరికి గౌరవం,మన ప్రాంతానికి గర్వకారణం.ఉదయ్ ఏఐ లో నిష్ణాతులు... సాంకేతికత ద్వారా వారు ప్రజలకు చేసిన సేవకు సరైన గుర్తింపు దక్కిందన్నారు.ఉదయ్ తెలంగాణ విద్యార్థులకు,ఉద్యోగులకు,ప్రజలకు ఏఐ సాంకేతికతను మరింత చేరువ చేయాలని కోరారు వారిని గౌరవించుకోవడం అందరికి అదృష్టం అని ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించిన తెలంగాణ వికాస సమితి ధన్యవాదములు తెలిపారు.

# పి.వి. నరసింహారావుకు విద్యారంగమంటే ఎంతో ప్రీతి

## - వంగర గురుకులంలో మాజీ ప్రధాని కుమార్తె డాక్టర్ సరస్వతి,అల్లుడు డాక్టర్ శరత్

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),ఆగస్టు11:** భారతరత్న, మాజీ ప్రధాని దివంగత పి.వి. నరసింహారావు కుమార్తె డాక్టర్ సరస్వతి, అల్లుడు డాక్టర్ కల్వకోట శరత్ దంపతులు శుక్రవారం కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని తమ స్వగ్రామమైన వంగరను సందర్శించారు.ఐదు దశాబ్దాల క్రితమే తెలంగాణ నుంచి అమెరికా వెళ్ళి అక్కడ ప్రముఖ వైద్యులుగా స్థిరపడిన వీరు, చాలాకాలం తర్వాత హైదరాబాద్ వచ్చారు. పి.వి. కుమారుడు ప్రభాకర్‌రావు ఆహ్వానం మేరకు గురువారం సాయంత్రం వంగరకు చేరుకున్న వీరు, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. శుక్రవారం ఉదయం పి.వి.మ్యూజియంలో తండ్రి అలనాటి అరుదైన ఫోటోలు,ఆయన వాడిన వస్తువులను తిలకించారు.అనంతరం పి.వి. విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కైలాస కళ్యాణి క్షేత్రంలోని పాత శివాలయంలో ప్రత్యేక అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ఉచిత విద్యతోనే పేదలకు మేలు: డాక్టర్ కల్వకోట శరత్

అనంతరం వంగర డాక్టర్ రంగారావు గురుకుల పాఠశాల/కళాశాలలో ఇంటర్ విద్యార్థులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ శరత్ మాట్లాడుతూ.. ఆశ్రమ పాఠశాలల ప్రాముఖ్యత: హుజూరాబాద్ ప్రాంత పేద పిల్లలకు ఉచిత ఆశ్రమ విద్యను అందించాలనే సత్సంకల్పంతో నాడు మంత్రిగా ఉన్న డాక్టర్ పి.వి. రంగారావు ఈ పాఠశాల స్థాపనకు ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు.

### ఉన్నత స్థానాల్లో విద్యార్థులు:

సుదీర్ఘ చరిత్ర ఉన్న ఈ పాఠశాలలో చదివిన ఎందరో విద్యార్థులు నేడు దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడటం ఎంతో గర్వకారణమన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులను గౌరవిస్తూ, ఉపాధ్యాయులు నేర్పిన విద్యను వంటపట్టించుకుని మంచి పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. నాటితో పోలిస్తే వంగర గ్రామం ఎంతో అభివృద్ధి చెందిందని ఆనందం వ్యక్తం చేశారు.

### మా చిన్నతనం ఇక్కడే గడిచింది: డాక్టర్ సరస్వతి

పి.వి. కుమార్తె డాక్టర్ సరస్వతి మాట్లాడుతూ...తన బాల్యం, ప్రాథమిక విద్య వంగరలోనే గడిచాయని, ఆనాటి మధుర స్మృతులు ఇప్పటికీ మదిలో పదిలంగా ఉన్నాయన్నారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి నా సోదరుడు దివంగత డాక్టర్ రంగారావు ఈ గురుకులాన్ని స్థాపించారు. ఉపాధ్యాయులనే తల్లిదండ్రులుగా భావిస్తూ ఉన్నత లక్ష్య సాధనకు కృషి చేయాలి.

### స్వర్గీయ పి.వి. నరసింహారావు పేరును ప్రతి ఒక్కరూ శాశ్వతంగా నిలబెట్టాలి.-డాక్టర్ సరస్వతి

నవోదయ విద్యాలయాలకు వంగర గురుకులమే మూలం: పి.వి. ప్రభాకర్‌రావు పి.వి. కుమారుడు ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. పేద ప్రజలకు సమానమైన,నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో నాటి విద్యాశాఖ మంత్రిగా పి.వి. నరసింహారావు తొలిసారి నల్గొండ జిల్లా సర్వేల్‌లో ఆశ్రమ పాఠశాలను ప్రారంభించారు. ఆ అనుభవంతోనే, తదనంతర కాలంలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నప్పుడు, నాటి ప్రధాని రాజీవ్ గాంధీ కోరిక మేరకు దేశవ్యాప్తంగా 'నవోదయ విద్యాలయాల' ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వంగర గురుకుల పాఠశాల నా సోదరుడు డాక్టర్ రంగారావు మానస పుత్రిక ఆయన బ్రహ్మచారి కావడంతో అందరినీ తన కుటుంబ సభ్యుల్లాగే భావించేవారు. అందుకోసమే సొంత భూమిని విరాళంగా ఇచ్చి శాశ్వత భవనాలకు శ్రీకారం చుట్టారు. పి.వి. పేరు నిలబడటమే మాకు ముఖ్యం.



### నూతన సాంకేతికతపై పట్టు సాధించాలి: పి.వి. మనీష్

పి.వి. మనుమడు మనీష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రాముఖ్యతను వివరించారు. మారుతున్న కాలంతో పోటీపడాలంటే సాంకేతిక విద్యను అభ్యసించాలని, అప్పుడే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని సూచించారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం: ఎస్ఐ దివ్య

స్థానిక ఎస్ఐ దివ్య మాట్లాడుతూ..విద్యార్థులు మరియు ప్రజలు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు ఓటీపీలు, వ్యక్తిగత మరియు బ్యాంకు వివరాలు చెప్పకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాలల గైడెన్స్ అధికారి తారాసింగ్, పి.వి. మదన్‌మోహన్, పి.వి. శరత్, కళాశాల ప్రిన్సిపాల్ అఫ్రోజు సుల్తానా, సీనియర్ అధ్యాపకులు భార్గవి, సిబ్బంది పెరుమాళ్ రవి, లక్ష్మీకాంత్, వెంకటరెడ్డి, బ్రహ్మశ్రీ చతుర్వేది బుచ్చిరెడ్డి, మల్లారెడ్డి, సురేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్సిఆర్ఏపై చర్చను జాతీయ ప్రయోజనాల కోణంలోనే చూడాలి

**- ప్రముఖ విశ్లేషకులు పి.వి.రావు**



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి (పి. సైదులు),ఆగస్టు11:** విదేశీ నిధుల నియంత్రణ చట్టం (ఎఫ్సిఆర్ఏ)పై జరుగుతున్న చర్చను మతపరమైన అంశంగా చిత్రీకరించడం సరికాదని, దీనిని దేశ ప్రయోజనాలు, జాతీయ భద్రత, ఆర్థిక పారదర్శకత, రాజ్యాంగ విలువలు అనే విస్తృత దృక్పథంలో చూడాలని ప్రముఖ విశ్లేషకులు పి.వి.రావు స్పష్టం చేశారు.ప్రముఖ న్యాయవేత్త హరీష్ సాల్వే, జర్నలిస్ట్ అర్ణబ్ గోస్వామిల మధ్య జరిగిన సంభాషణపై స్పందిస్తూ ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

### విదేశీ నిధులపై పారదర్శకత కోరడం మత వ్యతిరేకత కాదు:

ప్రతి సార్వభౌమ దేశానికి తన భూభాగంలోకి ప్రవేశించే విదేశీ నిధుల ప్రవాహాన్ని నియంత్రించే, పర్యవేక్షించే హక్కు ఉంటుందని పి.వి.రావు పేర్కొన్నారు. విదేశీ నిధులపై పారదర్శకత కోరడం ఏ మతానికీ వ్యతిరేకం కాదన్నారు.విదేశీ విరాళాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఎందుకు వస్తున్నాయి? ఎంత మొత్తంలో వస్తున్నాయి? ఏ కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు? అనే ప్రశ్నలకు స్పష్టమైన లెక్కలు ఉండటం ప్రజాస్వామ్య బాధ్యత అని తెలిపారు.మన రాజ్యాంగం ప్రతి పౌరుడికి మత స్వేచ్ఛను కల్పించిం దని, మత సంస్థలు తమ చట్టబద్ధమైన సేవా కార్యక్ర మాలను స్వేచ్ఛగా కొనసాగించవచ్చని ఆయన అన్నారు. అయితే, విదేశీ నిధులు చట్టవిరుద్ధ కార్యక లాపాలు, బలవంతపు మత మార్పిడులు లేదా రాజకీ య ప్రభావం కోసం వినియోగిస్తున్నాయా అనే అం శంపై చట్టబద్ధమైన పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు.

### అభివృద్ధి ప్రాజెక్టులు.. విదేశీ ప్రభావంపై పారదర్శకత అవసరం:

పర్యావరణ పరిరక్షణ, ప్రజా సమస్యలు, అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో సహజమైన నిరసన హక్కు అని పి.వి.రావు అన్నారు.అయితే దేశానికి కీలకమైన భారీ పరిశ్రమలు, విద్యుత్ ప్రాజెక్టులు, డ్యామ్‌లు, మౌలిక వసతుల ప్రాజెక్టులకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాలకు విదేశీ నిధులు అందుతున్నట్లయితే వాటి వెనుక ఉన్న ఉద్దేశాలు, నిధుల మూలాలు, ప్రభావాలపై పరిశీలన చేయడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు.అది ప్రజాస్వామ్య నిరసన హక్కును అణచివేయడం కాదని, విదేశీ ప్రయోజనాల ప్రభావం ఉందా లేదా అన్నది నిర్ధారించే పారదర్శక ప్రక్రియ మాత్రమేనని ఆయన వివరించారు.

### తప్పుడు నరేటివ్‌లపై సోషల్ మీడియా బాధ్యత:

సోషల్ మీడియా యుగంలో వక్రీకరించిన ఫోటో, వీడియో లేదా నిర్ధారణలేని సమాచారం క్షణాల్లో వైరల్ అయి తీవ్ర సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే ప్రమాదం ఉందని పి.వి.రావు హెచ్చరించారు.నిజం వెలుగులోకి వచ్చేలోపే తప్పుడు సమాచారం ప్రజల్లో గందరగోళాన్ని సృష్టిస్తోందన్నారు. దేశ సరిహద్దులను సైనికులు కాపాడుతున్నట్లే, దేశ అంతర్గత ఐక్యతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.సోషల్ మీడియాలో "ముందు స్పందించు తర్వాత తెలుసుకో" అనే ధోరణికి స్వస్తి చెప్పి, "ముందు నిర్ధారించు తర్వాత స్పందించు" అనే బాధ్యతాయుత సంస్కృతిని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.వాస్తవం కాదని తెలిసినా ఒక సమాచారాన్ని ఫార్వర్డ్ చేయడం సమాజానికి, దేశానికి హానికరమని ఆయన స్పష్టం చేశారు.

### జాతీయ భద్రత – రాజ్యాంగ స్వేచ్ఛల మధ్య సమతుల్యత అవసరం:

మీడియాకు ప్రశ్నించే స్వేచ్ఛ ఎంత ముఖ్యమో, వాస్తవాలను నిర్ధారించుకునే బాధ్యత కూడా అంతే ముఖ్యమని పి.వి.రావు అన్నారు.

జాతీయ భద్రత పేరుతో నిజాయితీగా పనిచేసే ఎన్జీవోలు లేదా ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేసే వారి గొంతు ను ప్రభుత్వం అణచివేయకూడదని, అదే సమయంలో స్వేచ్ఛ పేరుతో దేశ భద్రతను బలహీనపరిచే చర్యలకు కూడా అవకాశం ఇవ్వకూ డదని ఆయన పేర్కొన్నారు. "భారతదేశానికి ఈ రోజు అవసరమైనది భయం కాదు వాస్తవం; నరేటివ్ కాదు ఆధారం; విద్వేషం కాదు బాధ్యత" అని పి.వి.రావు అన్నారు. ఎఫ్సిఆర్ ఏపై చర్చను రాజకీయ విమర్శల స్థాయికి పరిమితం చేయకుండా రాజ్యాంగ విలువలు, జాతీయ ప్రయో జనాలు, పారదర్శకత, జాతీయ భద్రత ప్రాతిపదికన నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

# ఎస్ఐఆర్ 2026 డిజిటైజేషన్ 100 శాతం పూర్తి

**• 1,200కు పైగా ఓటర్లున్న రెండు పోలింగ్ కేంద్రాలకు అదనంగా రెండు పోలింగ్ స్టేషన్ల ప్రతిపాదనలు • రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో వెల్లడించిన సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్**



**తొలి అక్షరం/కల్లూరు, ఆగస్టు 11:** కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ అధ్యక్షతన మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు.ఎస్ఐఆర్ 2026 కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఎన్యుమరేషన్ ఫారమ్‌ల డిజిటైజేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేసినట్లు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో డేటా ఖచ్చితత్వం, పారదర్శకతకు డిజిటైజేషన్ ప్రక్రియ కీలకమని పేర్కొన్నారు. అదేవిధంగా 116 సత్తుపల్లి (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ స్టేషన్ నంబర్లు 61, 64లో ఓటర్ల సంఖ్య 1,200కు మించడంతో ఆయా పోలింగ్ ప్రాంతాల్లో అదనంగా రెండు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సమర్పించినట్లు సమావేశంలో వెల్లడించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఎన్నికల నిర్వహణ మరింత సమర్థవంతంగా జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో రాజకీయ పార్టీల భాగస్వామ్యం, సహకారం ఎంతో ముఖ్యమని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ అన్నారు. ఓటర్లకు సంబంధించిన అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చే సూచనలు, అభ్యంతరాలను పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికార యంత్రాంగానికి సహకరించాలని సబ్ కలెక్టర్ కోరారు. సమావేశంలో సంబంధిత ఎన్నికల అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జురెల్‌కు బదులు సర్ఫరాజ్ ఖాన్‌ను ఆడించాలి

### టీమిండియా మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్




రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా శ్రీలంకతో జరిగే తొలి మ్యాచ్‌లో ధ్రువ్ జురెల్‌కు బదులు సర్ఫరాజ్ ఖాన్‌ను ఆడించాలని టీమిండియా మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ సూచించాడు. ధ్రువ్ జురెల్ కంటే కూడా సర్ఫరాజ్ ఖాన్‌కు స్పిన్ బౌలింగ్‌ను అలవోకగా ఆడుతాడని అభిప్రాయపడ్డాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027లో భాగంగా రెండు టెస్ట్‌ల సిరీస్ కోసం టీమిండియా శ్రీలంక పర్యటన వెళ్లిన సంగతి తెలిసిందే. శనివారం(ఆగస్ట్ 15) గాలే వేదికగా తొలి టెస్ట్ ప్రారంభం కానుంది. ఇప్పటికే శ్రీలంకకు చేరి వామప్ మ్యాచ్ ఆడిన టీమిండియా ఈ సిరీస్ కోసం అన్ని విధాల సిద్ధమైంది. తొలి టెస్ట్ నేపథ్యంలో తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన కైఫ్.. తన తుది జట్టు అంచనాను వెల్లడించాడు. ధ్రువ్ జురెల్‌కు బదులు సర్ఫరాజ్ ఖాన్‌ను ఎంచుకున్నాడు. 'సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ధ్రువ్ జురెల్‌కు తుది జట్టులో అవకాశం కల్పిస్తారేమో. అతను నిలకడగా రాణించనప్పటికీ.. జట్టులో భాగమని భావిస్తే మాత్రం సర్ఫరాజ్ ఖాన్‌కు నిరాశే ఎదురవుతుంది. అతను అవకాశం కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. కానీ నా అభిప్రాయం ప్రకారం ధ్రువ్ జురెల్‌కు బదులు సర్ఫరాజ్ ఖాన్‌ను ఆడించాలి. ఎందుకంటే.. ధ్రువ్ జురెల్ కంటే సర్ఫరాజ్ ఖాన్ స్పిన్ బాగా ఆడుతాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో పిచ్ కండిషన్స్ అర్థమయ్యే కొద్దీ సర్ఫరాజ్ ఖాన్ రకరకాల షాట్స్ ఆడుతూ తనదైన శైలిలో బ్యాటింగ్‌ను కొనసాగించగలడు. ముఖ్యంగా ఉపఖండపు పిచ్‌ల్లో ఆట నాలుగో లేదా ఐదో రోజు వచ్చేసరికి పరిస్థితులు పూర్తిగా స్పిన్‌కు అనుకూలంగా మారిపోతాయి. ఇలాంటి కండిషన్స్‌లో బ్యాటింగ్ చేయడం కష్టంగా మారుతుంది. అప్పుడు సర్ఫరాజ్ ఖాన్ జట్టుకు బాగా ఉపయోగపడగలడు. అతను స్వీప్, రివర్స్ స్వీప్, ఎక్స్‌ట్రా కవర్స్, బ్యాక్‌ఫుట్ ఇలా ఏ షాటైనా స్పిన్ బౌలింగ్‌లో ఆడగలడు. మరోవైపు జురెల్ ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. వామప్ మ్యాచ్‌లోనూ అతను రెండు ఇన్నింగ్స్‌ల్లో 18 పరుగులు మాత్రమే చేశాడు.'అని కైఫ్ చెప్పుకొచ్చాడు. తన జట్టులో కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్‌లను ఓపెనర్‌గా ఎంపిక చేసిన కైఫ్.. దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్‌లతో పాటు సర్ఫరాజ్ ఖాన్, రవీంద్ర జడేజాలను మిడిలార్డర్ బ్యాటర్లుగా ఎంచుకున్నాడు. మానవ్ సుతార్, సారాన్ష్ జైన్‌లో ఒకరికి అవకాశం దక్కుతుందని, కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ స్పెషలిస్ట్ బౌలర్లుగా బరిలోకి దిగుతాడని అంచనా వేసాడు.

# కోహ్లీపై మాజీ ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్ ప్రశంసల జల్లు

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై మాజీ ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్ ప్రశంసల జల్లు కురిపించాడు. విరాట్ కోహ్లీ జట్టులో ఉంటే ఆటగాళ్లందరికీ పునకాలేనని చెప్పాడు. సహచర ఆటగాళ్లపై కోహ్లీ ప్రభావం తీవ్రంగా ఉంటుందని చెప్పాడు. అతని కారణంగా చుట్టూ ఉన్న ఆటగాళ్లు కూడా మైదానంలో మరింత ఎఫెర్ట్ పెడుతారని తెలిపాడు. బ్యాటింగ్‌లోనే కాకుండా ఫీల్డింగ్‌లోనూ కోహ్లీ తోపేనని చెప్పాడు. టీమిండియా ఫీల్డింగ్ కోచ్ బాధ్యతల నుంచి టీ దిలీప్ ఇటీవలే తప్పుకున్న సంగతి తెలిసిందే. విరాట్ కోహ్లీ సారథ్యంలోనే 2021లో ఫీల్డింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన టీ దిలీప్ ఐదేళ్లు సేవలందించాడు. ఇంగ్లండ్ టూర్ అనంతరం అతని కాంట్రాక్ట్‌ను పొడిగించేందుకు బీసీసీఐ నిరాకరించింది. దాంతో టీ దిలీప్‌కు ఉద్వాసన తప్పలేదు. తాజాగా జియోస్టార్ షోలో మాట్లాడిన టీ దిలీప్.. కోహ్లీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మ్యాచ్ ఆడుతున్నా.. ట్రైనింగ్ సెషెన్స్‌లో పాల్గొన్నా ఒకే ఇంటెంట్ చూపిస్తాడని తెలిపాడు. ట్రైనింగ్ సెషన్స్‌లో కూడా డైవ్ చేస్తూ బంతులను అడ్డుకుంటాడని దిలీప్ వెల్లడించాడు. 'విరాట్ కోహ్లీ.. ఇంటెన్సిటీ విషయంలో ఏ మాత్రం రాజీపడడు. పవర్‌ప్లేలో అతని ఆట తీరును మీరు చూసే ఉంటారు. బ్యాటర్‌గా అతను ఎలా ఉంటాడో.. కవర్ లేదా షార్ట్ మిడ్ వికెట్‌లో అతను ఫీల్డింగ్ చేసే తీరు కూడా అద్భుతంగా ఉంటుంది. ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లోనూ విరాట్ కోహ్లీ చాలా చురుకుగా డైవ్స్ చేస్తూ ఫీల్డింగ్ చేశాడు. తన ఆటతీరుతో ప్రత్యర్థిపై ఒత్తిడి తీసుకొస్తాడు. కెరీర్ చివరి దశలో ఉన్నా కూడా డెత్ ఓవర్లలో మైదానం చుట్టూ పరుగెడుతాడు. సర్కిల్ బయటకు ఫీల్డింగ్ విస్తరించినప్పుడు పరుగెత్తే తొలి ఆటగాడు అతనే. జట్టు కోసం అతను చూపించే ఇంటెండ్ అమోఘం. మైదానంలో అతని ప్రవర్తన నన్ను విపరీతంగా ఆకట్టుకుంటుంది. బంతి దగ్గరగా ఉన్నప్పుడే కాకుండా దూరంగా ఉన్నప్పుడు కూడా రియాక్ట్ అవుతుంటాడు. బంతి ఎప్పుడూ తన చేతుల్లోనే ఉండాలని కోరుకుంటాడు. విరాట్ కోహ్లీ ఆట తీరు.. ప్రాక్టీస్ సెషన్స్, మ్యాచ్‌ల్లోనూ ఒకేలా ఉంటుంది. అతనితో కలిసి ఆడుతున్నప్పుడు ఇతర ఆటగాళ్లు కూడా ప్రభావితమవుతారు. మైదానంలో మరింత ఎఫెర్ట్ పెట్టే ప్రయత్నం చేస్తారు. జట్టులో విరాట్ కోహ్లీ తీసుకువ్చే ప్రభావం అలాంటిది.'అని దిలీప్ కొనియాడాడు.





# పంత్‌కు అండగా మహమ్మద్ కైఫ్

పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్‌కు మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ అండగా నిలిచాడు. ప్రస్తుతం రిషభ్ పంత్ గడ్డు కాలం ఎదుర్కొంటున్నాడని, భారత టీ20, వన్డే జట్లలో చోటు కోల్పోయాడని తెలిపాడు. కానీ టెస్ట్‌ల్లో రిషభ్ పంత్‌కు తిరుగులేదని, శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో పంత్ రాణిస్తాడని కైఫ్ విశ్వాసం వ్యక్తం చేశాడు. రెండేళ్ల క్రితం భారత్ తరఫున చివరి అంతర్జాతీయ వైట్ బాల్ మ్యాచ్ ఆడిన రిషభ్ పంత్.. వరుసగా రెండు ఐపీఎల్ సీజన్లలో దారుణంగా విఫలమయ్యాడు. రూ.27 కోట్ల భారీ క్యాష్ ప్రైజ్ ట్యాగ్ రిషభ్ పంత్‌పై అనవసర ఒత్తిడిని తీసుకొచ్చింది. రిషభ్ పంత్ వైఫల్యంతో లక్నో సూపర్ జెయింట్స్ రెండు సీజన్లలో పేలవ ప్రదర్శన కనబర్చింది. దాంతో ఆ జట్టు కెప్టెన్సీ బాధ్యతల నుంచి రిషభ్ పంత్ తప్పుకున్నాడు. వైట్ బాల్ క్రికెట్‌లో విఫలమైనా రెడ్ బాల్ క్రికెట్‌లో పర్వాలేదనిపించాడు. శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు ముందు రిషభ్ పంత్ గురించి మాట్లాడిన కైఫ్.. ఇప్పటికీ సుదీర్ఘ ఫార్మాట్‌లో అతను గొప్ప ఆటగాడేనని అభిప్రాయపడ్డాడు. అయితే తనపై నిరంతరం ప్రతికూల వార్తలు వస్తుండటం వల్ల 28 ఏళ్ల రిషభ్ పంత్ తీవ్ర ఒత్తిడిలో ఉన్నాడని తెలిపాడు. అతనికి జట్టు మద్దతుగా నిలవాలని కోరాడు.'రిషభ్ పంత్‌ను ఇతర ఫార్మాట్లకు పరిగణనలోకి తీసుకోవడం లేదు. అతను వన్డేలు ఆడి చాలా రోజులు అయ్యింది. టీ20ల్లో అతని పేరును కూడా పరిశీలించడం లేదు. ఐపీఎల్‌లో కూడా అతను గడ్డు కాలం ఎదుర్కొన్నాడు. ప్రస్తుతం అతని గాశారం ఏ మాత్రం బాలేదు. కానీ టెస్ట్ క్రికెట్‌లో నేను అతన్ని కొంచెం భిన్నంగా చూస్తాను. టెస్ట్ మ్యాచ్‌ల్లో అతను ఏం చేయగలడో పరిగణనలోకి తీసుకొని మద్దతు ఇస్తాను. భారత జట్టుకు ఎన్నో చిరస్మరణీయమైన విజయాలు అందించిన పంత్.. అప్‌కమింగ్ రెండు టెస్ట్‌ల సిరీస్‌లో ఎలా రాణిస్తాడో చూడాలనుకుంటున్నా. అతనిపై చాలా ఒత్తిడి ఉందని తెలుసు. మీడియాలో అతని పేరును సాకూలంగా ప్రస్తావించడం లేదు. అతని గురించి ప్రతికూల చర్చలే జరుగుతున్నాయి. అత్యధిక ధర పలికిన ఆటగాడిగా రికార్డ్ సాధించిన విషయాన్ని పక్కన పెడితే.. అతని జట్టు దారుణంగా విఫలమై పాయింట్ల పట్టికలో వెనుకంజలో నిలిచింది. దాంతో జనాలు పంత్ గురించి ప్రతికూల చర్చలు చేశారు. కానీ టెస్ట్ క్రికెట్‌లో అతను ఎప్పటికీ గొప్ప ఆటగాడే.'అని కైఫ్ చెప్పుకొచ్చాడు. భారత్ తరఫున ఇప్పటి వరకు 50 టెస్ట్‌లు ఆడిన రిషభ్ పంత్ 43.37 సగటుతో 3557 పరుగులు చేశాడు. ఇందులో 19 హాఫ్ సెంచరీలతో పాటు 8 శతకాలు ఉన్నాయి.

# బంగాల్ క్రికెటర్ అభిషేక్ పోరెల్ అరెస్ట్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) దిల్లీ క్యాపిటల్స్ టీమ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న బంగాల్ క్రికెటర్ అభిషేక్ పోరెల్‌ను కోల్‌కతా పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఓ వైద్య విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన అత్యాచారం, బెదిరింపులు, దాడి తదితర ఆరోపణల కేసులో అభిషేక్ పోరెల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హుగ్లీ జిల్లా పరిధిలో నమోదైన ఆ కేసులో అభిషేక్ పోరెల్‌ను అరెస్ట్ చేయాలని ఇటీవల కలకత్తా హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో పోలీసులు చర్యలు చేపట్టారు. అయితే హుగ్లీ రూరల్ ఎస్పీ కున్వర్ భూషణ్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం, దమ్‌దమ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎమామి సిటీలో అభిషేక్ పోరెల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను కోర్టులో హాజరుపరిచారు. ఆ కేసులో దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. కర్ణాటకకు చెందిన ఓ వైద్య విద్యార్థిని గత జూన్‌లో హుగ్లీలోని మోగ్రా పోలీస్ స్టేషన్‌లో అభిషేక్ పోరెల్‌పై ఫిర్యాదు చేసింది. తనకు, అభిషేక్ పోరెల్‌కు సుమారు మూడు సంవత్సరాలుగా సంబంధం ఉందని ఆమె పేర్కొంది. పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి తనతో శారీరక సంబంధం పెట్టుకున్నాడని ఆరోపించింది. ఇద్దరం కలిసి విదేశాలకు కూడా వెళ్లినట్లు ఫిర్యాదులో తెలిపింది. అయితే గత ఏడాది నుంచి తమ మధ్య విభేదాలు మొదలయ్యాయని ఆమె పేర్కొంది. ఆ తర్వాత పోరెల్ తనకు దూరంగా ఉండటం ప్రారంభించాడని ఆరోపించింది. పెళ్లి చేసుకుంటానని గతంలో చెప్పినప్పటికీ ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకోవడానికి నిరాకరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. అభిషేక్ పోరెల్ తనపై దాడి చేశాడని, బెదిరింపులకు పాల్పడ్డాడని వైద్య విద్యార్థిని ఆరోపించింది. అంతేకాకుండా తనను కొంతకాలం నిర్బంధించి, ఆహారం కూడా ఇవ్వకుండా ఒంటరిగా ఉంచాడని ఫిర్యాదులో పేర్కొంది. ఆ కారణంగా తాను శారీరకంగా బలహీనపడటంతో పాటు సరిగ్గా నడవలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపింది. తనకు గాయాలు కావడంతో అత్యవసరంగా వైద్య చికిత్స తీసుకోవాల్సి వచ్చిందని ఆమె ఆరోపించింది. ప్రయాణానికి సంబంధించిన ఏర్పాట్లు ఉన్నప్పటికీ గాయాల కారణంగా వైద్య సహాయం పొందాల్సి వచ్చిందని ఫిర్యాదులో పేర్కొంది. వైద్య విద్యార్థిని ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే అభిషేక్ పోరెల్ ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ వెంటనే అతడిని అదుపులోకి తీసుకోలేకపోయారు. దీంతో బాధితురాలు కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. ఇటీవల కేసును పరిశీలించిన కలకత్తా హైకోర్టు, ఆరోపణలు ఎదుర్కొంటున్న క్రికెటర్‌ను అరెస్ట్ చేయాలని పోలీసులను ఆదేశించింది. దీంతో పోలీసులు అభిషేక్ పోరెల్ కోసం గాలింపు చేపట్టారు. చివరకు దమ్‌దమ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎమామి సిటీలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ కేసులో అత్యాచారం, క్రిమినల్ బెదిరింపులు, దాడి, నిర్బంధం తదితర ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోంది. తనపై వచ్చిన ఆరోపణలను అభిషేక్ పోరెల్ గతంలో ఖండించినట్లు సమాచారం.

# భువనేశ్వర్‌లో కాంటినెంటల్ టూర్

### ఈ నెల 22న 18 క్రీడాంశాల్లో పోటీలు



న్యూఢిల్లీ : భారత అథ్లెటిక్స్‌కు చిరునామాగా మారేందుకు భువనేశ్వర్ మరో అడుగు ముందుకేసింది. గత ఏడాది కళింగ స్టేడియంలో ఇండియన్ ఓపెన్ వరల్డ్ అథ్లెటిక్స్ బ్రాంజ్ లెవల్ టోర్నమెంట్ నిర్వహించగా.. తాజాగా వరల్డ్ అథ్లెటిక్స్ ఈ టోర్నమెంట్ స్థాయిని పెంచింది. దీంతో ఈ ఏడాది ఇక్కడ కాంటినెంటల్ సిల్వర్ లెవల్ టోర్నమెంట్ జరగనుంది. స్థాయి పెరగటంతో ఇక్కడ పోటీపడిన అథ్లెట్లకు కేటగిరీ బీ పాయింట్లు దక్కనుండగా, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రభావం చూపుతుంది. ఈ నెల 22న జరగనున్న కాంటినెంటల్ సిల్వర్ లెవల్ టోర్నమెంట్‌లో 18 క్రీడాంశాలకు వరల్డ్ అథ్లెటిక్స్ అనుమతి ఇచ్చింది. పురుషుల విభాగంలో 100మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 5000మీటర్లు, 110మీటర్ల హార్డిల్స్, హై జంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో ఉండనుం డగా.. మహిళల విభాగంలో 100 మీటర్లు, 400 మీటర్లు, 1500 మీటర్లు, 5000మీటర్లు, 100 మీటర్ల హార్డిల్స్, హై జంప్, లాంగ్ జంప్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో ఉండనున్నాయి. గత ఏడాది బ్రాంజ్ లెవల్ టోర్నమెంట్లో ప్రైజ్‌మనీ రూ.25 లక్షలు కాగా.. తాజాగా సిల్వర్ లెవల్ టోర్నమెంట్‌కు ప్రైజ్‌మనీ రూ.75 లక్షలు ఇవ్వనున్నారు. 2028 ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌తో పాటు అదే ఏడాది ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌కు సైతం భువనేశ్వర్ వేదికగా నిలువనున్న సంగతి తెలిసిందే.

**బరిలో స్టార్ అథ్లెట్లు**

భువనేశ్వర్ కాంటినెంటల్ సిల్వర్ లెవల్ టోర్నమెంట్‌లో భారత అగ్రశ్రేణి అథ్లెట్లు పోటీపడనున్నారు. స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా డైమండ్ లీగ్‌లో ఆ నెల 21న పోటీపడనున్నాడు.

దీంతో అతడు ఈ ఈవెంట్‌లో పోటీపడటం లేదు. కామన్‌వెల్త్ క్రీడల్లో పతకాలు సాధించిన మురళీ శ్రీశంకర్, యశ్ వీర్ సింగ్, గుల్వీర్ సింగ్, సీమా కలిరామా, సర్వేశ్‌లు ఇక్కడ పోటీపడనున్నారు. ప్రస్తుతం భారత అథ్లెటిక్స్ బృందం పోలాండ్‌లో శిక్షణ పొందుతుంది. అక్కడ్నుంచి నేరుగా భువనేశ్వర్‌కు చేరుకుని పోటీల్లో పాల్గొంటా రు.

# పళ్ల బురుసు సందేశాత్మక చిత్రం



'పళ్ళ బురుసు' లాంటి మంచి సందేశాత్మక చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నిర్మిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు నిర్మాత సుప్రియ యార్లగడ్డ. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్, గోమతి రెడ్డి ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమాని ఉదయ్ చౌహాన్ తెరకెక్కించారు. ఈ నెల 14న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుప్రియ మాట్లాడుతూ.. ఏఎన్నార్ ఉండిఉంటే మంచి చిత్రాన్ని నిర్మిస్తున్నందుకు ప్రశంసించేవారని అన్నారు. 'అందరూ ఎంతో ప్రేమించి తీసిన సినిమా 'పళ్ళ బురుసు'. దీన్ని చూస్తున్నంత సేపూ నవ్వుతూనే ఉన్నా. అదే సమయంలో కన్నీళ్లొచ్చాయి. మనసు బరువెక్కింది. ఇంత మంచి సినిమా చేసినందుకు చాలా తృప్తిగా అనిపించిందని నాగార్జున అన్నారు. . ఆయన అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై మరో నిర్మాత వివేక్ కృష్ణపాణితో కలిసి నిర్మించిన చిత్రమే 'పళ్ళ బురుసు'. అన్నపూర్ణ స్టూడియోస్ 50ఏళ్లు పూర్తి చేసుకుంది. నాన్న ప్రారంభించిన ఈ సంస్థలో ఎన్నో చక్కటి సినిమాలు చేశాం. ఈ 50వ సంవత్సరం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నాం. అన్నపూర్ణ డిస్ట్రిబ్యూషన్‌ని విస్తరించాం. ఇక ఈ చిత్ర విషయానికొస్తే.. తల్లిదండ్రుల్ని మనం చూసుకున్న దానికన్నా అదృష్టం ఇంకేదీ ఉండదు. అది చాలా ముఖ్యం. అలా నా తల్లిదండ్రుల్ని నేను చూసుకున్నా. ఇప్పటికీ అమల కూడా వాళ్ల అమ్మానాన్నల్ని ఎంతో జాగ్రత్తగా చూసుకుంటుంది. ఇందులో శంభు తాతగా సుధాకర్ అద్భుతంగా చేశారు. తన కొడుకు పాత్రలో మురళీధర్ చక్కగా నటించారు. ఈ నెల 14న మా అమ్మ పుట్టినరోజు. అమ్మానాన్నల ఆశీస్సులు ఈ చిత్రంపై ఉంటాయని నా నమ్మకం అన్నారు. కుటుంబంతో కలిసి చూడాల్సిన చిత్రమిది. అందరి మనసుల్ని హత్తుకుంటుంది' అన్నారు దర్శకుడు ఉదయ్. ఈ కార్యక్రమంలో సుప్రియ యార్లగడ్డ, మురళీధర్ గౌడ్, సుధాకర్, గోమతి, పవన్ సీహెచ్, ప్రసాద్, సురేశ్ గంగుల, ప్రజ్వల్ తదితరులు పాల్గొన్నారు.

----



# మోహన్ లాల్ కుమార్తె విస్మయ

## తుడక్కం మూవీతో అరంగేట్రం

మలయాళ యాక్షన్ థ్రిల్లర్ 'తుడక్కం'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు మోహన్ లాల్ కుమార్తె విస్మయ . జూడ్ ఆంటోనీ జోసెఫ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం రికార్డులు సృష్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన మహిళా ప్రాధాన్యమున్న మలయాళ చిత్రంగా నిలిచింది. బాక్సాఫీస్ నివేదికల ప్రకారం.. 'తుడక్కం' మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ. 6.8 కోట్లు వసూలు చేసింది. భారత్‌లో 1100ల థియేటర్లలో దీన్ని విడుదల చేశారు. ఓవర్సీస్‌లోనూ దీనికి మంచి స్పందన రావడంతో రికార్డు నెలకొల్పింది. మొదటి రోజు భారత్‌లో రూ. 2.55 కోట్లు సొంతం చేసుకుంది. దీంతో అంతకుముందు కల్యాణి ప్రియదర్శన్ నటించిన 'కొత్తలోక' సినిమా తొలిరోజు (రూ. 6.63 కోట్ల) ప్రపంచ వ్యాప్త వసూళ్లను 'తుడక్కం' అధిగమించింది. విస్మయ మోహన్‌లాల్, ప్రముఖ నిర్మాత ఆంటోనీ పెరుంబావూర్ కుమారుడు ఆశిష్ జోస్ ఆంటోనీలకు ఇది తొలి చిత్రం. 'మీను' పాత్రలో విస్మయ ఎంతో సహజంగా నటించగా, ఆశిష్ సైకో పాత్రలో తన నటనతో భయపెట్టారు. సమాజంలో మహిళలు ఎదుర్కొనే వేధింపులు, లైంగిక దాడులు, మనుగడ కోసం ఒక యువతి చేసే పోరాటం నేపథ్యంలో సాగే ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో మోహన్‌లాల్ అతిథి పాత్రలో కనిపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

# శబరిమలకు సంబంధం లేని ఇరుముడి

## దర్శకుడు శివ నిర్వాణ స్పష్టీకరణ




రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న లేటెస్ట్ ఫ్యామిలీ అండ్ డివోషనల్ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా పాటల్లో, టీజర్‌లో రవితేజ అయ్యప్ప మాలలో కనిపించారు. దీంతో ఈ చిత్ర కథపై సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వస్తున్నాయి. శబరిమల బ్యాక్‌డ్రాప్‌లో ఇది రానుందని ప్రచారం మొదలైంది. తాజాగా దీనిపై దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. శబరిమల దేవాలయానికి ఈ సినిమాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ కథకు శబరిమలతో ఎలాంటి సంబంధం లేదు. సినిమాలో కథానాయకుడి జీవితంలో 41 రోజుల అయ్యప్ప దీక్ష ఒక భాగం మాత్రమే. దీక్షా కాలంలో అయ్యప్ప భక్తులు తమ నియమావళి, అలవాట్ల విషయంలో చాలా నిష్టగా ఉంటారు. వ్యసనాలు ఉన్న ఒక వ్యక్తి ఈ దీక్ష తీసుకోవాల్సి వస్తే.. అతడు మద్యానికి దూరంగా ఉండాల్సి వస్తుంది. అక్కడే కథలో అసలైన సంఘర్షణ మొదలవుతుంది. కఠినమైన నియమాలు ఉండాలి కాబట్టే నేను అయ్యప్ప స్వామి దీక్ష నేపథ్యాన్ని ఎంచుకున్నాను. అంతే తప్ప ఇది శబరిమలకు సంబంధించిన కథ కాదని ఆయన పేర్కొన్నారు ఈ 41 రోజుల కథే స్క్రీన్‌ప్లేకి ప్రధాన బలంగా నిలుస్తుంది. అది సినిమాను మరింత ఆసక్తికరంగా మారుస్తుంది. ఆ దీక్షకు ముందు ఏం జరిగింది.. దీక్షలో ఉన్న సమయంలో ఏం జరిగిందనే విషయాలు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తాయని శివ నిర్వాణ తెలిపారు. రవితేజకు జోడీగా ప్రియా భవానీ శంకర్ నటిస్తున్న ఈ సినిమా ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు రానుంది

-------

# రుక్మిణీ వసంత్ మలయాళ ఎంట్రీ..



ఒక్క సినిమాతో మంచి సక్సెస్ అందుకున్నారు అంటే అది హీరోకైనా, హీరోయిన్ కైనా వరుసగా అవకాశాలు వచ్చి పడతాయి. అందులో భాగంగానే మరీ ముఖ్యంగా ఈ మధ్యకాలంలో యంగ్ హీరోయిన్స్ తమ అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంటూ ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. అలాంటి వారిలో రుక్మిణి వసంత్ కూడా ఒకరు. సప్త సాగరాలు దాచేయెల్లో అనే సినిమాతో వెండితెరకు పరిచయమైన రుక్మిణీ వసంత్.. తెలుగులో తొలిసారి నిఖిల్ సిద్దార్థ్ హీరోగా నటించిన అప్పుడో ఇప్పుడో ఎప్పుడో అనే చిత్రంతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. అయితే ఈ సినిమా పెద్దగా విజయాన్ని అందుకోలేదు. ఆ తర్వాత తమిళ్ లో శివ కార్తికేయన్ సరసన మదరాసి అనే సినిమా చేసింది. కానీ ఈ సినిమా సక్సెస్ కాలేదు. అయితే ఈ సినిమా ప్రమోషన్స్ సమయంలో డైరెక్టర్ ఈమెకు ఇచ్చిన ఎలివేషన్ కారణంగా ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చింది రుక్మిణి వసంత్. సరైన క్యారెక్టర్ పడితే తనను తాను నిరూపించుకోవడానికి ఎప్పుడూ సిద్ధమే అని కాంతారా చాప్టర్ వన్ చిత్రంతో నిరూపించింది. ఇందులో కీలకపాత్ర పోషించిన రుక్మిణి వసంత్.. సినిమా మొత్తం సాఫ్ట్ క్యారెక్టర్ తో ఆకట్టుకొని.. క్లైమాక్స్ లో ఒక్కసారిగా విలనిజం కనబరిచి అందరినీ ఆశ్చర్యపరిచింది. పైగా కొన్ని కొన్ని సన్నివేశాలలో హీరో రిషబ్ శెట్టి నే డామినేట్ చేసింది అంటే.. తన నటనతో ఏ విధంగా మెప్పించిందో అర్థం చేసుకోవచ్చు.అలాంటి ఈమె ప్రస్తుతం ప్రముఖ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న డ్రాగన్ సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఇదిలా ఉండగా ఇప్పుడు మరో క్రేజీ ఆఫర్ లభించింది .ఈ విషయాన్ని తన అధికారిక ఇంస్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులతో పంచుకుంది. నివిన్ పౌలీ సరసన హీరోయిన్ గా ఛాన్స్ కొట్టేసి.. మాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమయ్యింది. అందులో భాగంగానే ఈమె ఆన్ సెట్ కి వెళ్లిన సందర్భంగా క్లాప్ బోర్డు పట్టుకొని ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. మొత్తానికి అయితే రుక్మిణి వసంత్ మాలీవుడ్ లోకి అడుగుపెట్టడంతో అభిమానులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే తాను ఎంతో కాలంగా అభిమానిస్తున్న మాలీవుడ్ సినీ పరిశ్రమలో అవకాశం లభించడంతో తనకు చాలా ప్రత్యేకంగా అనిపిస్తుంది అంటూ రుక్మిణి చెప్పుకొచ్చింది. ఆ ప్రపంచంలో ఒక చిన్న స్థానం సంపాదించడం తనకు ఒక ముఖ్యమైన తొలి అడుగు అని , ఈ ప్రాజెక్టులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికి కూడా ధన్యవాదాలు తెలిపింది. ఈ సినిమాలో నివిన్ పౌలీ హీరోగా నటించడమే కాకుండా తన సొంత బ్యానర్ అయిన పౌలీ జూనియర్ పిక్చర్స్ బ్యానర్ పై మార్టిన్ ప్రాక్కాట్ ఫిలిమ్స్ తో కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో మలయాళ నటుడు అజు వర్గీస్ కీలక పాత్ర పోషిస్తున్నారు. గతంలో తమలయాల సూపర్ హిట్ కామెడీ మూవీ జయ జయ జయ జయ హే అనే చిత్రానికి సహా రచయితగా పనిచేసిన నషీద్ ఫామీ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు.





# టాక్సిక్ రన్‌టైమ్ పై ఆసక్తికర ప్రచారం

ప్రస్తుతం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో



'టాక్సిక్ ఒకటి. యశ్ ప్రధానపాత్రలో గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికర వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 'టాక్సిక్' రన్‌టైమ్ 3 గంటల 11 నిమిషాలంటూ ప్రచారం జరుగుతోంది. సినిమాలో అధికంగా రక్తపాతం, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. గీతూమోహన్ దాస్ తన కథపై నమ్మకంతోనే ఈ నిడివితో సెన్సార్‌కు పంపారని సమాచారం. ఈ సినిమాను ప్రైమ్ బిగ్ స్క్రీన్ ఫార్మాట్ అయిన ఐమాక్స్‌లో కూడా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. కన్నడ ఇండస్ట్రీ నుంచి ఐమాక్స్ ఫార్మాట్‌లో విడుదలవుతోన్న రెండో సినిమా ఇది కాగా.. రెండు ఐమాక్స్ చిత్రాలను (కేజీఎఫ్ 2, టాక్సిక్) తన ఖాతాలో వేసుకున్న ఏకైక కన్నడ స్టార్‌గా యశ్ రికార్డు సృష్టించారు. త్వరలోనే దేశవ్యాప్తంగా ఐమాక్స్ బుకింగ్స్ కూడా ప్రారంభం కానున్నాయి. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాలో యశ్‌కు జోడీగా నయనతార, కియారా అడ్వాణీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి, తారా సుతారియా నటించారు.

---------------



# కలెక్షన్లలో కనకరాజు దూకుడు

మెగాహీరో వరుణ్ తేజ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. హారర్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా మొదటి వీకెండ్‌లోనే సుమారు రూ. 37 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి అద్భుతమైన విజయాన్ని అందుకుంది. ఇక వీకెండ్ ముగిసిన తర్వాత వచ్చిన మొదటి వర్కింగ్ డే అయిన సోమవారం కూడా ఈ సినిమా తన జోరును ఏమాత్రం తగ్గించలేదు. కఠినమైన 'మండే టెస్ట్'ను ఈ చిత్రం చాలా విజయవంతంగా పాస్ అయింది. విడుదలైన నాలుగో రోజు అయిన సోమవారం ఒక్కరోజే బుక్‌మైషో మరియు డిస్ట్రిక్ట్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా 70 వేలకు పైగా టికెట్లు అమ్ముడవ్వడం విశేషం. దీనివల్ల మొదటి వారపు రోజుల్లోనూ సినిమాకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని స్పష్టమవుతోంది. ఇలాగే కలెక్షన్స్ కొనసాగితే రాబోయే రోజుల్లోనూ థియేటర్లలో ఈ చిత్రం హవా మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఇదిలాఉంటే, ఈ సినిమా ఘన విజయం సాధించిన సందర్భంగా చిత్ర యూనిట్ సక్సెస్ మీట్‌ను ఘనంగా నిర్వహిస్తోంది. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ఎస్.ఎస్. థమన్ సంగీతం అందించారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు యువి క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి.